



రైల్వేస్టేషన్లు.. జాతికి అంకితం

- కొన్ని పనులకు శంకుస్థాపన
- వీడియో లింకు ద్వారా ప్రారంభించిన ప్రధాని మోదీ
- గుంటూరులో హాజరైన బీజేపీ నేత సత్యకుమార్



గుంటూరు రైల్వేస్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న బీజేపీ నేత సత్యకుమార్



మంగళగిరి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పేదలకు విమానాశ్రయాల స్థాయి సదుపాయాలు కల్పించడమే అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ ముఖ్య ఉద్దేశమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సోమవారం మధ్యాహ్నం ఆయన వీడియో లింకు ద్వారా ఏబీఎస్ఎస్ కింద అభి వృద్ధి చేసిన రైల్వేస్టేషన్లను జాతికి అంకితం చేశారు. అలానే మరికొన్ని రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు శంకుస్థాపన చేశారు. కొత్తగా నిర్మించిన ఆర్‌యూబీలను ప్రారంభించారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ప్రధానమైన గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, బీజేపీ రాష్ట్ర నాయకుడు సత్యప్రసాద్‌కుమార్, గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ, ఇతర అధికారులు, జెడ్ఆర్‌యూసీసీ, డీఆర్ యూసీసీ సభ్యులు హాజరయ్యారు. ఏబీఎస్ఎస్ కింద రూ.17.13 కోట్ల వ్యయంతో బాపట్ల, రూ. 15.80 కోట్లతో గుంటూరు, రూ.40.67 కోట్లతో మంగళగిరి, రూ.11.30 కోట్లతో నరసరావుపేట, రూ.11.30 కోట్లతో సత్తెనపల్లి రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పనులన్నీ పూర్తి అయితే ఉత్తమ శ్రేణితో కూడిన అనుభూతి ప్రయాణీకులకు కలుగుతుందని ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోదీ అన్నారు. అదే విధంగా ఎన్ఎస్‌జీ-5 కేటగిరీకి చెందిన పలు స్టేషన్ల అభివృద్ధి పనులను, అలానే ఆర్‌యూబీలకు ప్రధాని శంకుస్థాపన చేశారు. ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాలను గుంటూరు డివిజన్‌లో సోమవారం పండగ వాతావరణంలో నిర్వహించారు. స్థానిక పాఠశాలల విద్యార్థులను భాగస్వామ్యం చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వికసిత్ రైల్వేస్టేషన్ల కాన్సెప్ట్‌తో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అలానే స్థానిక ప్రజాప్రతినిధులను కూడా పాల్గొనేలా చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఏడీఆర్ఎంలు ఆర్.శ్రీనివాస్, కె.సైమన్, సీనియర్ డీఈఎన్ కోఆర్డినేషన్ జేవీ అనూష తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం సందేహం

- వాయిదాలతో లబ్ధిదారుల్లో ఆందోళన
- ఎన్నికల కోడ్ ముంచుకొస్తున్నా తాత్సారం
- నిరవధికంగా వాయిదా పడిన చేయూత పథకం
- అదే బాటలో విద్యాదీవెన, ఈబీసీ నేస్తం పథకాలు

చేయూత వాయిదా పడింది.. విద్యా దీవెన వాయిదా వేశారు.. ఈబీసీ నేస్తం ఇప్పుడు కాదంటున్నారు.. మొత్తంమీద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెప్పుకుంటున్న సంక్షేమ పథకాల అమల్లో సందేహాలు నెలకొంటున్నాయి. ఆయా పథకాల నగదు ఎప్పుడు పడుతుందో.. అసలు పడుతుందా లేదా అనేది అనుమానంగా ఉంది. ఒక వైపు ఎన్నికల కోడ్ తరుముకొస్తుంటే, మరోవైపు ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు తేదీలను వాయిదా వేస్తూ వస్తోంది. తాజాగా ఈ నెల 26న అమలు చేస్తామని ప్రకటించిన వైఎస్సార్ చేయూత పథకాన్ని ప్రభుత్వం వాయిదా వేసింది. జగనన్న విద్యాదీవెన, ఈబీసీ నేస్తం పథకాలు కూడా అదే బాటలో ఉన్నాయి. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళనలు నెలకొన్నాయి.

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. ఆ వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఆ తర్వాత సంక్షేమ పథకాల అమలుకు ఎన్నికల సంఘం చెక్ పెడుతుంది. ఇదంతా తెలిసి కూడా ప్రభుత్వం సంక్షేమ పథకాలను వాయిదా వేస్తూ వస్తోంది. ఈ నెల 26న ప్రారంభం కావాల్సిన నాలుగో విడత చేయూత పథకాన్ని తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తారో కూడా చెప్పకుండా ప్రభుత్వం వాయిదా వేసింది. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 2 లక్షల 70 వేల మంది లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కావాలనే ఎన్నికల కోడ్ వచ్చే వరకు తాత్సారం చేస్తూ వస్తోందేమోనన్న అనుమానం లబ్ధిదారుల నుంచి వ్యక్తమవుతోంది.



వాయిదాల పర్వంతో వంచన

వాయిదా పద్ధతిని అనుసరిస్తూ ప్రభుత్వం ఆది నుంచి సంక్షేమ పథకాలను నీరుగారుస్తూ వస్తోంది. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే పథకంపై హడావుడి చేసిన ప్రభుత్వం 2020 ఆగస్టు 12 వరకూ ఆ పథకం ఊసే ఎత్తలేదు. అధికారం చేపట్టిన 14 నెలల వరకూ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనైనా ప్రారంభించలేదు. ఆ తర్వాత 2021 జూన్‌లో రెండో దఫా చేయూత నగదు అందించిన ప్రభుత్వం మరో 16 నెలల తర్వాత 2022 సెప్టెంబరు 23న మూడో దఫా చేయూత అందించింది. మూడో దఫా చేయూత అంది ఇప్పటికి 16 నెలలు కావస్తున్నా నాలుగో దఫా చేయూత విడుదల చేయలేదు. కిందటేడాది సెప్టెంబరు నుంచి చేయూత ఇదిగో.. అదిగో అంటున్న ప్రభుత్వం ఇప్పటి వరకూ పథకాన్ని ప్రారంభించలేదు. తొలుత అక్టోబరులో అని, ఆ తర్వాత జనవరిలో అని, అటు పిమ్మట ఫిబ్రవరి చివర్లో అని, ఆఖరికి అది కూడా వాయిదా వేశారు. దీంతో లబ్ధిదారులు ఈసురోమంటున్నారు.

ప్రకటనల్లోనే.. క్యాలెండరు

ప్రతి ఏటా సంక్షేమ క్యాలెండరు విడుదల చేస్తాం. ఆ ప్రకారం పథకాలను అమలు చేస్తాం అని బడాయి మాటలు చెప్పిన ప్రభుత్వం ఆచరణలో లబ్ధిదారులను అడుగడుగునా వంచించింది. ప్రతి ఏటా అమలు చేస్తానన్న పథకాలను వాయిదాల మీద వాయిదాలు వేసుకుంటూ నెట్టుకొస్తోంది. ఐదేళ్ల పాలనలో ఒక్క సంక్షేమం కూడా పూర్తి స్థాయిలో అమలు కాలేదు. ఐదేళ్లలో వైఎస్సార్ చేయూత నాలుగు దఫాలకు మూడు దఫాలు, అమ్మఒడి ఐదేళ్లకు నాలుగు దఫాలు మాత్రమే అమలు జరిగింది. ఆసరా పథకం నాలుగో దఫా బటన్ నొక్కినా ఇప్పటి వరకూ లబ్ధిదారుల ఖాతాల్లో రుణమాఫీ డబ్బు మాత్రం జమకాలేదు. జగనన్న విద్యాదీవెన మూడు, నాలుగు దఫాలుగా విద్యార్థులకు దక్కడం లేదు. కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పరిస్థితి అంతే. ప్రభుత్వం ఏనాడో ప్రకటించాల్సిన ఈబీసీ నేస్తం, విద్యాదీవెన పథకాలను కూడా ఫిబ్రవరికి వాయిదా వేసింది. ఎన్నికల కోడ్ వచ్చే లోపు అవి కూడా అమలవుతాయో లేదో అనుమానమే.



పరిహారం ఏదీ?

- కోల్డ్ స్టోరేజ్‌లో అగ్నిప్రమాదం జరిగి నెలలు గడుస్తోంది
- పరిహారం అందించకుంటే మార్చి 1 నుంచి రిలే నిరాహార దీక్షలు
- సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాలో రైతు సంఘం నాయకులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి26: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్‌లో అగ్నిప్రమాదం జరిగి, అందులో నిల్వచేసిన పసుపు, ఇతర పంటలు అగ్నికి ఆహుతై దిక్కుతోచని స్థితిలో రైతాంగం ఉంటే ప్రభుత్వం మాత్రం కమిటీల పేరుతో నష్టపరిహారం అందించకుండా కాలయాపన చేస్తోందని రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. రైతులకు ఈ నెలాఖరు లోపు పరిహారం ఇవ్వకుంటే మార్చి1 నుంచి రిలేనిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. అగ్నిప్రమాదంలో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ సోమవారం రైతులతో కలిసి రైతుసంఘం నాయకులు పట్టణంలో ర్యాలీగా వచ్చి సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదం సంభవించి నేటికి 37 రోజులు కావస్తున్నా ప్రభుత్వం, యాజమాన్యం పంట నష్టపోయిన రైతులను ఆదుకునేలా స్పష్టమైన ప్రకటన చేయలేదన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ రైతులకు రూ.100 కోట్లు నష్టం వాటిల్లినా కమిటీ నివేదిక పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయడం శోచనీయమన్నారు. జీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్, రేపల్లె మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజ్‌లో అగ్నిప్రమాదం సంభవించిన అనంతరం మంటలను అదుపుచేసే యంత్రాంగం లేకపోవడం యాజమాన్యం బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రమాద బీమాతో పాటు విపత్తుల నిధినుంచి క్వింటాల్‌కు రూ.12వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు వేములపల్లి వెంకటరామయ్య మాట్లాడుతూ తక్షణమే నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పసుపు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ములకా శివసాంబిరెడ్డి, తెలుగురైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, తెలుగురైతు నాయకులు ఈదర పూర్ణచంద్, ఏపీ రైతుసంఘం తెనాలి అధ్యక్షులు మద్దన సాంబశివరావు, సీఐటీయూ నాయకులు కెవీ ప్రసాద్, షేక్ హుస్సేన్ వలి, వైబ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు, రైతు సంఘం నాయకులు

రాజాగారి చెరువులో.. చేపల చేటు!

- రాజా గారి చేపల చెరువులో అన్నీ క్యాట్‌ఫిష్‌లే
- విచ్చలవిడిగా నిషేధిత చేపల పెంపకం
- చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలు
- ఆరోగ్యానికి హానికరం.. పర్యావరణానికి విఘాతం
- మత్స్యశాఖలో అవినీతి ముత్యాలు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 26: మీరు మార్కెట్‌లో చేపలు కొనేందుకు మార్కెట్‌కి వెళ్తున్నారా? మీరు రెస్టారెంట్లు, హోటళ్లల్లో చేపల కూర, వేపుడు తింటున్నారా?? జాగ్రత్త. అపోలో ఫిష్ అని కొన్నిచోట్ల.. కొరమీను అని, మరికొన్ని చోట్ల హానికర చేపలను మీకు అంట గడుతున్నారని గుర్తించండి. అవి తింటే రోగాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లే. ఇదంతా ఎందుకంటే.. గుంటూరు జిల్లాలో నిషేధిత క్యాట్‌ఫిష్ సాగు యథేచ్ఛగా కొనసాగుతోంది. అధిక లాభాల కోసం కొందరు ప్రజల ఆరోగ్యానికి టెండర్ పెట్టేస్తున్నారు. కుళ్లిన కోళ్ల వ్యర్థాలతో హానికర చేపలను పెంచి మార్కెట్‌లో అమ్మకాలు జరుపు తున్నారు. ఏది నకిలీనో.. ఏది అసలో తెలియని కొనుగోలుదారుడు డబ్బులిచ్చి మరీ క్యాన్సర్ మహమ్మారిని ఇంటికి తీసుకుపోతున్నారు. చేబ్రోలు మండలంలో ఈ నిషిద్ధ చేపల సాగు మూడు పువ్వులు ఆరుకాయలన్నట్లుగా ఉంది. అయినా మత్స్యశాఖ అధికారులకు అదేమి పట్టటం లేదు.

హాని కలిగించే క్యాట్ ఫిష్..

చెరువులు ఏర్పాటు చేసి ఆక్వా సాగులో చేపలు పెంచడం మనకు తెలిసిందే. ఆ రీతిలో పెంచే చేపలకు ఆరోగ్య వంతమైన సోయాబీన్ దాణా పెడతారు. కానీ క్యాట్‌ఫిష్ పెంపకం అలా కాదు. అది కుళ్లిన మాంసాన్ని తిని పెరిగే చేప. కేవలం ఆరు నెలల్లోనే ఇరవై కేజీల బరువు వరకు పెరుగుతుంది. చికెన్ దుకాణాల్లో రోజు వారీ వచ్చే వ్యర్థాలను తెచ్చి వీటికి వేస్తారు. అన్నీ కుళ్లినవే కావటంతో ఈ చేపల పెంపకం వల్ల పర్యావరణం దెబ్బతినడమే కాకుండా భూగర్భ జలాలు, వాతావరణం కలుషితమవుతుంది. సోయాబీన్, తవుడు వంటి వాటితో తయారు చేసిన దాణా కిలో రూ.50 వరకు పడుతుంది. అదే చికెన్ వ్యర్థాలయితే కేవలం కిలో రూ.10కే వస్తుంది. ఇక్కడ తీవ్రంగా కక్కుర్తి పడుతున్న వ్యాపారులు క్యాట్‌ఫిష్‌ను పెంచి ప్రజల ఆరోగ్యాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారు.

బోల్తా కొట్టిస్తున్నారు!

చేపలో ఉన్న అసలు నకిలీ తేల్చటం అంత తేలికైన పని కాదు. క్యాట్‌ఫిష్ కూడా అటువంటిదే. అపోలో ఫిష్‌ను, కొరమీనులను పోలి ఉంటుంది. చేపల్లో బాగా డిమాండ్ ఉండే కొరమీనును పోలి ఉండే ఈ చేపలను మీసాలు పీకేసి కొరమీను పేరుతో ఎక్కువ ధరలకు అమ్మేస్తున్నారు. కొరమీనుకు ఒక ముళ్ళు ఉంటుంది క్యాట్‌ఫిష్‌కు అసలు ముళ్ళే ఉండవు. క్యాట్ ఫిష్‌లో ఉండే ఒమేగా ఫ్యాట్ నాడీవ్యవస్థను దెబ్బ తీయడం మాత్రమే కాకుండా క్యాన్సర్‌కు కారణమవుతుంది. కిలో కొరమీను రూ.700 నుంచి రూ.1000 వరకు పలుకుతుంది. క్యాట్‌ఫిష్‌ను కిలో రూ.150కే యథేచ్ఛగా అమ్మేస్తున్నారు. వాటినే గుంటూరులోని రెస్టారెంట్లు, హోటళ్లల్లో విచ్చలవిడిగా వాడుతున్నారు. పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించే క్యాట్‌ఫిష్ సాగును ప్రభుత్వం ఎప్పుడో నిషేధించింది. కొందరు అధికారుల అలసత్వం, అవినీతితో వాటి సాగు ఇంకా కొనసాగుతూనే ఉంది.

మత్స్య శాఖ స్పందన శూన్యం

నిషేధిత క్యాట్‌ఫిష్ సాగును అరికట్టాల్సిన బాధ్యత పూర్తిగా మత్స్యశాఖదే అయితే ఆ శాఖ అధికారులు చెరువుల యజమానులతో మంచి సంబంధాలు కలిగి ఉన్నారని అంటు న్నారు. నెల నెలా ముడుపులు తీసుకుంటున్నట్లుగా కొందరు ఆరోపిస్తున్నా రు. అందువల్లే సరైన తనిఖీలు చేయకుండా క్యాట్ ఫిష్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.







నారాకోడూరు సమీపంలోని చెరువులో పైకి తేలుతున్న చికెన్ వ్యర్థాలు

క్వారీ గుంతలే చేపల చెరువులు

చేబ్రోలు మండలంలో చాలాచోట్ల క్యాట్ ఫిష్ సాగుచేస్తున్నారు. నారాకోడూరు, అనంతవరం, వీరనాయకునిపాలెం గ్రామాల్లో ఈ నిషేధిత చేపలను పెంచుతున్నారు. అక్రమ మైనింగ్ జరిపిన క్వారీ గుంతలనే చెరువులుగా వాడుతున్నారు. ఇక్కడ ఒక ప్రజాప్రతినిధి ముఖ్య అనుచరుడు వీటిని సాగు చేయిస్తున్నట్లు చెబుతున్నారు. గ్రామస్తులు ఇక్కడ జరుగుతున్న చేపల సాగుపై అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న నాథుడు లేడు. ఈ చెరువులకు ఒకే వ్యక్తి కోళ్ల వ్యర్థాలను సరఫరా చేస్తున్నారని చెబుతున్నారు. వాటి దుర్వాసనను భరించలేక పోతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.



వైసీపీకి ఓటమి భయం పట్టుకొన్నది

- అందుకే పోలీసులతో దాడులు చేయిస్తున్నది
- బీజేపీ కార్యదర్శి సత్యకుమార్

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కి ఓటమి భయం పట్టుకుందని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ అన్నారు. అందుకే ప్రతిపక్షాలపై దాడులు చేసి ప్రజలను భయపెట్టి లబ్ది పొందాలని చూస్తున్నదన్నారు. సోమవారం నగరానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ ఆటలు ఇంక ఎంతమాత్రం సాగవన్నారు. ఇప్పుడు చేస్తున్న దాడులకు త్వరలోనే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎయిమ్స్‌కి జగన్ ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. అదే విషయాన్ని తమ నాయకులు ప్రస్తావిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే అందులో తప్పేముందన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే చట్టపరంగా పరిష్కారం చేసుకోవాలేగాని, పోలీసులతో దాడులు చేయించటం కరెక్ట్ కాదు. ప్రజలకు చేసిన వాగ్దానాలు నిలబెట్టుకోనందుకు వాటి గురించి ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే ఎదురుదాడి చేయడం పరిపాటైపోయిందన్నారు. తాను ఏమి చెబితే అదే రాజ్యాంగం అన్నట్లుగా వ్యవహరిస్తున్న తీరు చెల్లదన్నారు. టీడీపీ-జనసేనతో పొత్తు విషయమై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఇప్పటికే చెప్పారన్నారు. పొత్తుల విషయాన్ని తమ అధినాయకత్వం చూసుకొంటుందన్నారు. అప్పటివరకు తాము రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజెపి జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందు సాంబశివరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, మాగంటి సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు స్థలంపై.. కన్నేశారు..

- రాత్రికి రాత్రే హద్దు రాళ్లు పాతిన వైనం
- కొండపోరంబోకు స్థలాన్ని ప్లాట్లుగా విభజన
- గతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసిన రెవెన్యూ అధికారులు
- హెచ్చరిక బోర్డులు తొలగించి ఆక్రమణకు సిద్ధం





నిడుముక్కలలో కొండపోరంబోకు స్థలాన్ని ఆక్రమించి హద్దురాళ్లు పాతిన దృశ్యం

నిడుముక్కల(తాడికొండ), ఫిబ్రవరి 26: ప్రభుత్వ స్థలం కనిపిస్తే దానిని ఆక్రమించుకొనే వరకు అధికారపార్టీ నేతలు వదలిపెట్టడం లేదు. రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన లెక్కచేయకుండా తమ ఆక్రమణకు సిద్ధం అవుతూనే ఉన్నారు. తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో కొండకు అనుకొని ఉన్న సుమారు 50 సెంట్ల స్థలాన్ని ఆక్రమించి ప్లాట్లుగా విభజించి అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. రాత్రికి రాత్రే ఆ స్థలంలో సున్నం పోసి హద్దురాళ్లను ఏర్పాటు చేశారు. సుమారు 15 ప్లాట్లుగా విభజించారు. అదేంటని స్థానికులు ప్రశ్నిస్తే అధికారులే పర్మిషన్లు ఇచ్చారంటూ చెప్తున్నారు. గతంలో ఇదేవిధంగా సదరు స్థలాన్ని ఎక్స్‌కవేటర్‌తో చదును చేసి ప్లాట్లుగా విభజన చేయటానికి ప్రయత్నించటంతో రెవెన్యూ అధికారులు అడ్డుకొని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. హెచ్చరిక బోర్డును సైతం పక్కకు నెట్టి అధికారపార్టీ నేతలు తమపని చేసుకు పోతున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు. ఆ స్థలాన్ని గ్రామానికి చెందిన కలవకొల్లు వరదయ్య పూర్వ కాలం నుంచి సాగుచేసుకొని జీవనం సాగించారు. భూమిని సాగు చేస్తున్న క్రమంలో 1998లో వరదయ్య మరణించటంతో సదరు భూమిలో ఆయన మృతదేహాన్ని పూడ్చిపెట్టిన కుటుంబ సభ్యులు అప్పటినుంచి ఆ భూమిని సాగు చేస్తున్నారు. అయితే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సమాధిని కూల్చి వేసి భూమిని అధీనంలోకి తీసుకున్నారని వరదయ్య కుమారుడు వెంకటేశ్వరరావు గత సంవత్సరం అగస్టు నెలలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా అక్రమార్కులు భూమిని చదును చేసి ప్లాట్లుగా వేసి విక్రయించటానికి సిద్ధం చేస్తున్నారు.



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

ఇసుకను బొక్కేశారు.. అమరావతిని తొక్కేశారు

- మూడు ముక్కలాటతో రాష్ట్రానికి తీరని నష్టం..
- 1532వ రోజుకు చేరుకున్న రాజధాని రైతుల ఆందోళనలు

తుళ్ళూరు , ఫిబ్రవరి 26: రాష్ట్రంలో ఇసుకను వైసీపీ నేతలు తెగ బొక్కేశారని, అందుకే ఎన్జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబునల్) రూ.1908 కోట్లు జరిమానా విధించిందని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆరోపించారు. మూడు రాజధానులు వద్దు, అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని, బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1532వరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి వారు మాట్లాడుతూ మూడు రాజధానుల మూడు ముక్కలాటతో సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రానికి తీరని నష్టాన్ని మిగిల్చారన్నారు. అభివృద్ధిని విస్మరించి వనరులన్నింటినీ దోచుకుతిన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతి విషయంపై ఉన్నత న్యాయ స్థానం తీర్పును లెక్కచేయని నియంత జగన్‌రెడ్డి అని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించని వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలన్నారు. నియంతృత్వం పోవాలంటే ఎన్నికలలో వైసీపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని విజ్ఞప్తి చేశారు. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేసి అమరావతి వెలుగు కార్యక్రమం రాజధాని గ్రామాలలో కొనసాగించారు.

టీడీపీలోకి వైసీపీ నేత కళ్ళం హరినాథ్‌రెడ్డి

- కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించిన అధినేత చంద్రబాబు



హరినాథ్‌రెడ్డికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు, పక్కన వేగేశన

బాపట్ల, ఫిబ్రవరి 26 : వైసీపీ సీనియర్ నేత, ప్రముఖ న్యాయవాది కళ్ళం హరినాథ్‌రెడ్డి సోమవారం టీడీపీలో చేరారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని ఆయన నివాసం వద్ద హరినాథ్‌రెడ్డికి టీడీపీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థి, నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్ర వర్మ సేవాకార్యక్రమాలపై ఆసక్తితో హరినాథ్‌రెడ్డి టీడీపీలో చేరారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించిన ఆయన రెండుసార్లు బాపట్ల ఎమ్మెల్యే టిక్కెట్టు ఆశించి భంగపడ్డారు. రెడ్డి సామాజిక వర్గానికి ఎమ్మెల్యే కోన రఘుపతి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని పలుమార్లు ఆరోపణలు గుప్పించారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు బాపట్ల టిక్కెట్టును నరేంద్రవర్మకు ప్రకటించటంతో వైసీపీ స్థానిక నాయకుల విధానాలు నచ్చక ఆపార్టీని వీడి టీడీపీలో చేరినట్లు హరనాథ్‌రెడ్డి తెలిపారు. నరేంద్రవర్మ విజయానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

అర్ధరాత్రి ఘర్షణలపై
మూడు కేసులు

- ఇరు వర్గాలలోని 30 మందిపై నమోదు
- ఘర్షణకు కారణమైన వడ్డిముక్కల నాగభూషణంపై కేసు
- వడ్డిముక్కల గ్రామంలో పోలీస్ పికెటింగ్



కాల్వపై నడకదారికి అడ్డంగా నిర్మించిన కర్రల తడిక, ఫ్లెక్సీలు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి26: పరస్పర దాడులు తీవ్ర ఉద్రిక్తలకు దారితీసిన సంఘటనలపై పొన్నూరు అర్బన్, రూరల్ పోలీసులు మూడు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెనాలి డీఎస్పీ రమేష్ తెలిపారు. పొన్నూరు పట్టణంలో అధికార వైసీపీలోని రెండు వర్గాలు ఆదివారం అర్ధరాత్రి పొన్నూరు పోలీస్‌స్టేషన్ సాక్షిగా పరస్పర దాడులకు తెగబడ్డారు. ఇరువర్గీయుల పరస్పర దాడుల నేపథ్యంలో ఒక్కొక్క వర్గంలోని 15 మందిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అలాగే ఈ దాడులకు మూల కారకుడైన వడ్డిముక్కల గ్రామానికి చెందిన చింతకింద నాగభూషణంపై కేసు నమోదు చేసి రూల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘర్షణలకు నేపథ్యం...

మండల పరిధిలోని వడ్డిముక్కల గ్రామంలో గ్రామ ప్రధాన రహదారి వెంట చింతకింద నాగభూషణ రావు గృహం ఉంది. ఈ గృహం ముందు నుంచి మూడు అడుగుల వెడల్పుతో తమకు నడక దారి ఉందని, ఆ సమీపంలోనే నివాసం ఉంటున్న ముస్లింలు అంటున్నారు. అయితే నాగభూషణరావు ఆ స్థలం కూడా తనదేనంటూ, ఆవైపు నడకదారి లేకుండా మురుగు కాల్వపై అడ్డంగా కర్రలతో దడి ఏర్పాటుచేసి, ఆ దడికి వైసీపీ ఫ్లెక్సీలను కట్టి మురుగు కాల్వను పూడ్చివేసాడు. ఈసందర్భంగా ఏర్పడిన వివాదంతో నాగభూషణరావు తమను మతపరంగానూ, వ్యక్తిగతంగానూ దూషించాడని స్థానిక ముస్లిం మహిళలు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వడ్డిముక్కల ముస్లింలు అంజుమన్ కమిటి అధ్యక్షుడు, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అనుచరుడు షేక్ మహ్మద్ అలియాజ్ మామూ, వైసీపీలో అసమతి వర్గనేతగా ముద్రపడిన మైనార్టీ నేత షేక్ నాజర్‌లు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో అసలు విషయం పక్కదారిపట్టి, కొసరు విషయం (వైసీపీలో గ్రూపు తగాదాలు) వచ్చి చేరింది. దీంతో వివాదం ముదిరింది. నాజర్, మామూల వర్గీయులు పోలీస్‌స్టేషన్ సాక్షిగా బాహాబాహీ ఘర్షణకు దిగారు. ఇరువర్గాలకు చెందిన వందలాది మంది అక్కడకు చేరుకొని కర్రలు, రాళ్ల గాజు సీసాలు విసురుకోవటంతో పలువురికి గాయాలయ్యాయి. ఆ సమయంలో పలువురు పోలీసులకు సైతం దాడులకు గురికావల్సి వచ్చింది. పరిస్థితి చేయిదాటిపోవటంతో తెనాలి డీఎస్పీ రంగంలోకి దిగి అధనపు పోలీస్‌సిబ్బందిని రప్పించి పరిస్థితిని అదుపుచేశారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే పోలీస్ స్టేషన్ సాక్షిగా, పోలీసుల సమక్షంలో అధికార వైసీపీలోని రెండు వర్గాల వారు కర్రలు, సీసాలతో ఘర్షణకు దిగడం శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల వైఫల్యాన్ని తేటతెల్లం చేసింది.

గ్రామంలో పోలీస్ పికెటింగ్..

స్వల్ప వివాదం నేపథ్యంలో తీవ్ర ఉధృత్తలకు దారితీసిన వడ్డిముక్కల గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి రూరల్ ఎస్ఐ బీ. భార్గవ్ నేతృత్వంలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేసారు. గ్రామంలోకి బయట వ్యక్తుల సంచారంపై నిఘా పెట్టారు.

జగన్.. అసమర్ధ సీఎం

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు



సభలో మాట్లాడుతున్న నక్కా ఆనందబాబు, వేదికపై కన్నా, వైవీ

సత్తెనపల్లి ఫిబ్రవరి 26: పరిపాలన చేతకాని అసమర్ధ సీఎం జగన్ అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు విమర్శించారు. సత్తెనపల్లి పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో సోమవారం 'నవ్యాంధ్ర రాష్ట్రం' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. టీడీపీ సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణతో కలసి ఆయన నవ్యాంధ్ర రాష్ట్రం పుస్తకాన్ని ఆనందబాబు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ఆయనపై ఉన్న కేసుల నుంచి తప్పించుకోవడానికి, ఆస్తులను కూడబెట్టుకోవడానికి తన అధికారాన్ని, ప్రభుత్వాన్ని వాడుకుంటున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉండగా అమరావతినే రాజధానిగా ఒప్పుకున్న జగన్, అధికారంలోకి రాగానే మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. పోలవరం అభివృద్ధిని చంద్రబాబునాయడు 72శాతం పూర్తి చేస్తే జగన్ అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు నిర్మాణాన్ని విస్మరించాడన్నారు. మద్య నిషేధం హామీని అమలు చేయడంలో విఫలమయ్యాడన్నారు. సైకో జగన్‌ను రాష్ట్రం నుండి తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కన్నా లక్ష్మీనారాయణను సత్తెనపల్లి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సీఎంజగన్ అన్నివర్గాల ప్రజలను దారుణంగా మోసం చేశాడన్నారు. నవరత్నాలు, సంక్షేమం ముసుగులో రాష్ట్రాన్ని దోచుకున్నాడన్నారు. సైకో జగన్‌ను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో కన్నా లక్ష్మీనారాయణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యెలినేడి రామస్వామి, నాగోతు శౌరయ్య, చౌట శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, నూర్‌బాషా జానీబాబు, అంకాళ్ళ ప్రభుదాసు, తురకా మేరిగ్రేస్, యెలినేడి లక్ష్మీ తులసీ, నాగరాజు, సాంబయ్య, రామచంద్రరావు, ఆశీ ర్వాదం, దత్తాత్రేయులు, అబ్దుల నబీ తదితరులు పాల్గొన్నారు.

యువతను రోడ్డుపాలు చేసిన జగన్‌రెడ్డి

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు
- యువతతో 'మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్'



యువ ఓటర్లతో ప్రత్తిపాటి పుల్లారావు, జనసేన నేత రాజా రమేష్

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 26 : ఒక్క ఛాన్స్ అన్న మాట నమ్మిన పాపానికి యువతను రోడ్డున పడేసిన ఘనుడు సీఎం జగన్ అని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. 2019 ఎన్నికలకు ముందు జగన్ అమలు చేయలేని హామీలు ఇచ్చి యువత ఓట్లు కొల్లగొట్టి మోసం చేశారని ఆయన మండి పడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిరుద్యోగ భృతితో పాటు రకరకాల హామీలు ఇచ్చి జగన్ మోసం చేశాడని, అందుకే ఈ సారి రాష్ట్రంలో యువత తొలిసారిగా వేసే ఓటు దేశ, రాష్ట్రగతిని మార్చేదిగా ఉండాలన్నారు. మంగళవారం పట్టణంలోని పత్తిపాటి గార్డెన్‌లో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్' కార్యక్రమానికి మాజీ మంత్రి ప్రత్తిపాటితో పాటు తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు తేజశ్విని పొడపాటి, జనసేన నేత తోట రాజారమేష్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా తేజశ్విని మాట్లాడుతూ 2024 ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్‌కు చాలా కీలకం అన్నారు. ఆ దృష్ట్యా అన్ని రంగాలకు చెందిన ప్రొఫెషనల్ యువతతో పాటు ప్రతి ఒక్కరు రాష్ట్రాభివృద్ధికి టీడీపీ ప్రభుత్వ ఏర్పాటు అనివార్యమన్న విషయాన్ని గుర్తించాలన్నారు. రాజా రమేష్ మాట్లాడుతూ భవిష్యత్‌లో తమకు ఎవరు ఉన్నత భవిష్యత్ కల్పిస్తారు? ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు? అనే విషయాలను యువత ఆలోచించాలన్నారు. గత ఎన్నికల్లో జగన్ ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని నమ్మించి యువతను మోసంచేశారన్నారు. జగన్‌పాలనలో రాష్ట్రానికి పరిశ్రమలు, ఉద్యోగాలు రాలేదని, గంజాయి మాత్రం దేశం మొత్తం ఎగుమతి చేస్తున్నారని ప్రత్తిపాటి ఎద్దేవా చేశారు. టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో తొలిసారి ఓటు వచ్చిన యువత పాల్గొన్నారు.

భారత జాతీయ ప్రమాణాలపై
గ్రామ సర్పంచ్‌లకు వర్క్‌షాప్

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 27: భారతదేశ జాతీయ ప్రమాణాల సంస్థ (బ్యూరో ఇండియన్ స్టాండర్డ్స్)ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండు దఫాలుగా ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ నెల 27 నుంచి మార్చి 1 వరకు, మార్చి 4 నుంచి 7 వరకు రోజుకు వర్క్‌షాప్ జరగనుంది. వివిధ ఉత్పత్తులపై భారతీయ ప్రమాణాలపై అవగాహన కల్పించేందుకు ఈవర్క్‌షాప్ ఏర్పాటుచేయనున్నారు. గుంటూరు జిల్లా వారికి గుంటూరులోని జడ్పీ సమావేశ మందిరంలో, పల్నాడు జిల్లాకు చెందినవారికి నరసరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో, బాపట్లజిల్లాకు చెందిన వారికి అక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఈ వర్క్ షాప్ జరగనుంది.



ఏపీ భవన్ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న పాపారావు

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి

- ఏపీ భవన్ వద్ద బాపట్లవాసి నిరసన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్రత్యేక హోదా ఇవ్వాలని బాపట్లు వాసి పాపారావు డిమాండ్ చేశారు. సోమవారం, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని ఏపీ భవన్ అంబేద్కర్ విగ్రహం ముందు ఆయన నిరసన తెలిపారు. రైతు భరోసా ,వెల్ నెస్ సెంటర్ల కాంట్రాక్ట్ నిర్మాణం పనులు చేపట్టినప్పటికీ జగన్ సర్కారు తనకు నిధులు విడుదల చేయలేదన్నారు. దాదాపు రూ.25 లక్షల మేర డబ్బులు రావాల్సి ఉందన్నారు. గత ఎన్నికలలో జగన్‌కు ఓటు వేశానని.. ఇప్పుడు మాత్రం ఓటు వేయబోనని పాపారావు స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు

టీడీపీ, జనసేన సీట్ల ప్రకటనతో
వైసీపీకి వెన్నులో వణుకు

- ఓటమి భయంతో మంత్రుల అవాకులు చెవాకులు
- జనసేనాని ఆదేశాలను శిరసావహించేందుకు సిద్ధం
- ధ్వజమెత్తిన జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు

గుంటూరు, ఫిబ్రవరి 26: టీడీపీ, జనసేన కూటమి సీట్ల ప్రకటన చూసి వైసీపీ ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే మంత్రులు అవాకులు, చెవాకులు పేలుతున్నారని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మండిపడ్డారు. సోమవారం లాడ్జి కూడలిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో గ్రావెల్, మట్టి మాఫియా చేసుకోవడానికే అంబటి రాంబాబుకు మంత్రి పదవి ఇచ్చినట్లు ఉందని గాదె దుయ్యబట్టారు. నియోజకవర్గంలో అంబటి ఓట్లు అడగానికి వెడితే.. ఆడవాళ్ల చెప్పులతో కొడతారని ఆయన ధ్వజమెత్తారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం వదిలి వేరే నియోజకవర్గానికి పారిపోయిన చెల్లని నాణెం లాంటి చెల్లుబోయని వేణుగోపాల్ కూడా జనసేన, టీడీపీ కూటమిని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. మహా జనానికి మరదలు పిల్ల వంటి మంత్రి రోజాకు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ దొరకడం కూడా కష్టమేనని, ముందు తన ఉనికిని ఆమె కాపాడుకోవాలని గాదె హితవుపలికారు. జనసేనాని పవన్ కల్యాణ్ ఇచ్చే ఎటువంటి ఆదేశాలనైనా క్రమశిక్షణతో పాటించేందుకు జనసైనికులు, వీరమహిళలు సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో జనసేన కార్పోరేటర్ యర్రంశెట్టి పద్మావతి, నాయకులు శిఖా బాలు, బిట్రగుంట మల్లిక, చట్టాల త్రినాద్, చింత శివ, గోపిశెట్టి సాయి, యర్రంశెట్టి సాయి తదితరులు పాల్గొన్నారు.

అరాచకత్వం రాజ్యమేలుతోంది

- బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్
- వైసీపీ దాడిలో గాయపడిన బాధితుడికి పరామర్శ



రామకృష్ణను పరామర్శిస్తున్న సత్యకుమార్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 26 : ఆంధ్రప్రదేశ్‌లో ఆరాచక పరిస్థితి రాజ్యమేలుతోందని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ అన్నారు. ఇటీవల నరసరావుపేట మండలం అల్లూరివారిపాలెంలో వైసీపీ దాడిలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణను సోమవారం స్థానిక బీజేపీ నేతలతో కలసి సత్యకుమార్ పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగిశెట్టి రామకృష్ణ బీజేపీ ప్రజాపోరు కార్యక్రమం ప్రచారంలో ఉండగా వైసీపీ రౌడీమూక వెంకటప్పారెడ్డి, జయబారత్‌రెడ్డిలు బీజేపీ నేతలపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. కేసు రిజిస్టర్ చేయకపోతే సీఎం ఇంటిని సైతం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌బాబు, బీజేపీ నేతలు డాక్టర్ ఎస్. వెంకటరావు, కృపారావు, ఆదినారాయణ, హనుమంతురావు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

ఎమ్మెల్యే కిలారికి ధూళిపాళ్ల లీగల్ నోటీస్..

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 26: ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సోమవారం లీగల్ నోటీస్‌ను పంపించారు. 2019 అసెంబ్లీ ఎన్నికలో పరాజయం పాలైన సందర్భంలో నరేంద్ర కుమార్ కాపు సామాజిక వర్గంపై అనుచిత వాఖ్యలు చేసారని తీవ్ర వెల్లలూరు గ్రామంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆరోపించారు. తనపై నిరాధార ఆరోపణల నేపథ్యంలో ఎమ్మెల్యే కిలారికి నరేంద్ర కుమార్ తన న్యాయవాది ద్వారా పరువు నష్టం నోటీస్‌ను పంపించారు. కాపు కులస్తుల మనోభావాలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు ఎమ్మెల్యే కిలారి ప్రయత్నిస్తున్నారన్ని లీగల్ నోటీస్‌లో నరేంద్రకుమార్ పేర్కొన్నారు. వారంరోజులో ఈ విషయమై బహిరంగ క్షమాపణ ప్రకటించి రూ. కోటి నష్టపరిహారంగా చెల్లించని పక్షంలో కోర్టులో కేసు దాఖలుచేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటానని నరేంద్రకుమార్ నోటీసులో హెచ్చరించారు.



తిరునాళ్ళకు సంబంధించి పలు సూచనలు చేస్తున్న ఎస్పీ రవి శంకర్‌రెడ్డి

కోటప్పకొండ తిరునాళ్లకు సిద్ధం

- త్రికోటేశ్వరుని దర్శించుకున్న ఎస్పీ రవి శంకర్‌రెడ్డి

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 26 : ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ తిరునాళ్ళకు పోలీసు అధికారులు సన్నద్ధంగా ఉండాలని ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామిని సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవి శంకర్‌రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం ఆయన కోటప్పకొండ పరిసరాలను పరిశీలించి తిరునాళ్ళ ఏర్పాట్లకు సంబంధించి తగు సూచనలు చేశారు.వాహనాల రాకపోకలు, పార్కింగ్, భక్తుల కోసం క్యూ ఏర్పాటు, ప్రభలు నిలిపే ప్రదేశాలు తదితర వాటికి ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. గత సంవత్సరం తిరునాళ్ళ సమయంలో ఎక్కడైనా ట్రాఫిక్ సమస్య తలెత్తితే దానికి కారణం తెలుసుకొని ఈ సంవత్సరం ఆ విధ మైన సమస్య ఉత్పన్న మవ్వకుండా చూడాలన్నారు. రోడ్లు భవనాలశాఖ సమన్వయంతో రోడ్లు వెడల్పు చేయించటం, రోడ్డు మార్గాల్లో అవాంతరాలు ఉంటే తొలగించటం, చిన్న చిన్న బ్రిడ్జీలు, కల్వర్టులను బాగు చేయించటం తదితర పనులు చేయించాలని సూచించారు. ఆలయ అధికారులతో మాట్లాడి కొండపైన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడిచుట్టూ ఫెన్సింగ్ వేయించాలన్నారు. ప్రభలు నిలిపే ప్రదేశాలు పరిశీలించి అక్కడ ఎటువంటి అవాంతరాలు ఎదురవ్వకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ రామచంద్రరాజు, నరసరావుపేట డీఎస్పీ వర్మ, ఎస్బీ సీఐలు ప్రభాకర్, బాల నాగిరెడ్డి, రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రోశయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన అనంతరం బ్రోచర్ ఆవిష్కరణ చేస్తున్న వర్సిటీ ప్రతినిధులు

సార్వత్రిక మానవత్వాన్ని పెంపొందించాలి

- ఆస్ట్రేలియాలోని ఫ్లిన్‌డర్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జిలియన్ డూలె
- ఏఎన్‌యూలో ప్రారంభమైన మూడు రోజుల గ్లోబల్ సదస్సు

పెదకాకాని, ఫిబ్రవరి 26 ప్రతి ఒక్కరిలో మానవతా విలువలు పెంపొందించుకునేలా సార్వత్రిక మానవత్వాన్ని చూపాలని ఆస్ట్రేలియాలోని ఫ్లిన్‌డర్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్. జిలియన్ డూలే అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఆస్ట్రేలియన్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో యూజీసీ సహకారంతో 'మార్జినాలిటీ మల్టీకల్చరల్ లెటర్ నేటివ్ ఆస్ట్రేలియా అండ్ ఇండియా' అనే అంశంపై మూడు రోజుల గ్లోబల్ సదస్సు సోమవారం లాంఛనంగా ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమానికి సదస్సు డైరెక్టర్ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య పీ.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తలుగా పాల్గొన్న ప్రొఫెసర్ డూలే మాట్లాడుతూ సమాజంలో విద్వేషాలు, మారణకాండలు, జాతిపరంగా అనేక హింసలు జరుగుతున్నాయని, వాటిని తొలగించి మానవత్వాన్ని చూపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అణగదొక్కబడేవారు వెనుకబాటుతనంలోనే ఉంటున్నారని, మానవులంతా సమానమే అన్న రీతిలో వారికి తగిన ప్రోత్సాహం అందించాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరు గుర్తెరగాలన్నారు. అమెరికాలోని ఈస్ట్ కరోలైన యూనివర్సిటీ ప్రొఫెసర్ సియోడియల్ ఫ్రాంక్‌హెచ్.డీన మాట్లాడుతూ బహుళ సాంస్కృతిక సమ్మిళిత సమాజాన్ని పెంపొందించడానికి సంగీతం, నృత్యం కీలకపాత్ర పోషిస్తాయని వాటిల్లోకి నేడు క్రీడలు చేరాయన్నారు. ఉన్నతులు, బలహీన వర్గాల వారిని చేరదీయాలే గాని ఇబ్బందులకు గురి చేయకూడదన్నారు. వీసీ పీ. రాజశేఖర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే ప్రతి దేశంలో ఏదో ఒక ప్రాంతంలో అణగారిన వారు అణగదొక్కబడుతూనే ఉన్నారన్నారు. దీనికి కారణం అతి కొద్ది మంది చేతుల్లో అధికారం, సంపద ఉండటమేనన్నారు. అంతర్గతంగా ఉన్న బలమైన వర్గం నుంచి ఎదురవుతున్న వివక్ష అధికంగా ఉంటుందని అన్నారు. మరొక వక్తగా పాల్గొన్న కలకత్తాలోని యూనివర్సిటీ ఆఫ్ బుర్ద్వాన్ నుంచివచ్చిన ప్రొఫెసర్ ప్రొఫెసర్ అంగ్షుమాన్ కర్ మాట్లాడుతూ ఆస్ట్రేలియా అధ్యయనాల పరిధిని విస్తృతం చేసేలా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఆస్ట్రేలియన్ స్టడీస్ చేస్తున్న పరిశోధనలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెక్టర్ ప్రొఫెసర్ వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బీ.కరుణ, ఇంగ్లీష్ విభాగాధిపతి ప్రొఫెసర్ జీ.చెన్నారెడ్డి పాల్గొన్నారు.

కేసులో రాజీ పడనందున వ్యక్తి హత్య

- నిందితులను శిక్షించాలని దళిత సంఘాల ఆందోళన



సాంబశివరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రమేష్, సీఐ వెంకటేశ్వర్లు

కొల్లిపర, ఫిబ్రవరి 26 : పాత కేసు విషయంలో రాజీ పడనందున ఒక వ్యక్తిని హత్య చేసిన సంఘటన మండల పరిధిలోని దావులూరు అడ్డరోడ్డు జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తూములూరు గ్రామానికి చెందిన నాలాది సాంబశివరావు (35)కు అదే గ్రామానికి చెందిన సమ్మెట అంజనేయులు కుటుంబ సభ్యుల మధ్య పాత కేసులు ఉండటంతో పాటు కోర్టులో విచారణ జరుగుతుంది. ఈ కేసు విషయంలో సాంబశివరావు రాజీకి రావటంలేదని మనస్సులో పెట్టుకుని సోమవారం తెల్లవారు జామున సమ్మెట అంజనేయులు అతని భార్య భూలక్ష్మి, మరొక వ్యక్తి చాగంటి శేఖర్‌రెడ్డి కలిసి హత్య చేసినట్లు ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు. సాంబశివరావు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని విచారణచేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ రమేష్, సీఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాంబశివరావును హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని దావులూరు అడ్డరోడ్డు సెంటర్‌లో దళిత సంఘాల నేతలు బడ్డికొట్టును తగలబెట్టి ఆందోళన చేశారు. డీఎస్పీ రమేష్ నిందితులను తొందరలోనే అరెస్టు చేస్తామని హామీ ఇవ్వటంతో వారు ఆందోళనను విరమించారు.

1,42,382 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,59,820 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా, 1,42,382 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 1,03,060 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లుపేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	20000
నెంబరు. 5	13800	19000
273	12500	16000
341	11000	20500
4884	12000	15000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21000
బ్యాడిగి	10000	20000
దేవనూరు డీలక్స్	12000	19500
తెల్లకాయలు	5000	13000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



కన్నెగంటి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డేగల ప్రభాకర్

కన్నెగంటి పోరాట స్ఫూర్తి శ్లాఘనీయం

● టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్

గుంటూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కన్నెగంటి హనుమంతు పోరాట స్ఫూర్తి శ్లాఘనీయమని టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. పార్టీ అర్బన్ కార్యాలయంలో సోమవారం కన్నెగంటి హనుమంతు 102వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కన్నెగంటి హనుమంతు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భగా ప్రభాకర్ మాట్లాడుతూ పుల్లరి వ్యతిరేక ఉద్యమంతో బ్రిటీష్ సామ్రాజ్య వాదులను గడగడలాడించి తెలుగుజాతిలో చైతన్యాన్ని రగలించారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికి ఆదర్శమని, ఆయన బాటలో ప్రతి ఒక్కరూ ధైర్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సౌపాటి రత్నం, తాడివాక సుబ్బారావు, యర్రగోపు నాగేశ్వరరావు, షేక్ బాజీ మాస్టర్, నిశంక రరావు అమర్నాధ్, ఎద్దల రమేష్, బొక్కినమ్ శివరామ్, సాదు కేశవ్, కొండెపు శేఖర్, చిలుకూరి రవి, అబ్దుల్ గఫార్, అడపా ప్రసాద్, ప్రదీప్, హనుమాన్ బాబు, నాగిరెడ్డి, నర్రా సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కన్నెగంటి హనుమంతు పోరాటాలు చిరస్మరణీయం

గుంటూరు(తూర్పు): పశువులు, మేకలు తినే గడ్డి, ఆకులపై, కట్టెపుల్లలపై బ్రిటీష్ వారు విధించే 'పుల్లరి' పన్నుకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు కన్నెగంటి హనుమంతు అని పశ్చిమ నియోజకవర్గ టీడీపీ నేత డాక్టర్ శనక్కాయల రాజకుమారి అన్నారు. కన్నెగంటి 102 వర్ధంతి సందర్భంగా సోమవారం చుట్టుగుంటలోని హనుమంతు విగ్రహానికి నివాళులర్పించారు.

మద్యనిషేధంపై మాట తప్పిన జగన్‌రెడ్డి

● టీడీపీ పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర



గుంటూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మద్యపాన నిషేధంపై సీఎం జగన్‌రెడ్డి మాట తప్పి, మడమ తిప్పారని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) విమర్శించారు. పార్టీ పశ్చిమ కార్యాల యంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యపానాన్ని నిషేధించకపోగా మద్యం రేట్లను 3 రెట్లు పెంచి 2 లక్షల కోట్ల నాసిరకం మద్యం అమ్మి లక్షకోట్ల ఆదాయాన్ని తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించుకున్నాడన్నారు. నాసిరకం మద్యం తాగిన వారిలో దాదాపు 35 లక్షలమంది ఆసుపత్రుల పాలయ్యారన్నారు. 30 వేల మంది చనిపోయారన్నారు. నాసిరకం మద్యం పోవాలంటే జగన్ రెడ్డిని గద్దె దింపేయాలని నాని పిలుపునిచ్చారు.

మహిళల ఓట్ల కోసమే మద్యనిషేధం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల ప్రచారంలో మహిళల ఓట్లను కొల్లగొట్టేందుకే జగన్‌రెడ్డి మద్యపాన నిషేధం హామీని ఇచ్చారని, అనంతరం అధికారంలోకి రాగానే ఆ హామీని తుంగలో తొక్కాడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ మండిపడ్డారు. పశ్చిమ నియోజకవర్గంలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మద్య హామీని నిలబెట్టుకోకపోవడమే కాక, కల్తీ మద్యాన్ని తీసుకువచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మద్యం వ్యాపారాన్ని తన గుప్పిట్లో పెట్టుకుని కోట్లు గడిస్తున్నారని విమర్శించారు. ఏపీలో లభించే నగం బ్రాండ్లు జగన్ సొంత ఫ్యాక్టరీలో తయారవుతున్నవేనన్నారు. మద్యం వ్యాపారం మీద సీఎం జగన్ రూ. 57,600 కోట్లు సంపాదించారని మన్నవ మోహనకృష్ణ ఆరోపించారు.



పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

● సూపర్‌వైజరీ అధికారులకు కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 26 : నగరం లోని తూర్పు, పశ్చిమ నియోజికవర్గాల్లో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై సూపర్‌వైజరీ అధికారులు బాధ్యత తీసుకోవాలని జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం నగరంలోని రైల్ పేట, సీతారామ్ నగర్, మంగళ్ దాస్ నగర్, ఇజ్రాయిల్ పేట, వెంకట్రావ్ నగర్, సంగడి గుంట, ఐపిడి కాలనీ, పొన్నూరు రోడ్ తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో కమీషనర్ అధికారులతో కలిసి పరిశీలించి మౌలిక వసతుల ఏర్పాటు పై తగు ఆదేశాలు జారి చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్వోల సహకారంతో మౌలిక వసతుల కల్పన పై సూపర్‌వైజరీ అధికారులు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్లు, ఏసీపీలు, టీపీఎస్‌లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ ప్రభంజనంలో వైసీపీ ఖాళీ

● జనసేన నగర అధ్యక్షుడు నేరెళ్ల వెల్లడి

గుంటూరు, ఫిబ్రవరి 26: రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ విజయ ప్రభంజనంలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమని జనసేన అర్బన్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల సురేష్ అన్నారు. సోమవారం జనసేన పార్టీ నాయకులు ఏడుకొండులు, మిద్దె నాగరాజు ఆధ్వర్యంలో 17వ డివిజన్ పరిధిలోని ఎత్తు ఆంజనేయస్వామి గుడి సెంటర్ నుంచి నల్లచెరువు మూడు బొమ్మల సెంటర్ వరకు భారీ ర్యాలీతో నిర్వహించిన 'జనంతోకి జనసేన' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఏటుకూరు దర్గా మాన్యం సెంటర్‌లో కార్పొరేటర్లు యర్రంశెట్టి పద్మావతి, దాసరి లక్ష్మీదుర్గతో కలసి జనసేన జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లీం వర్గాలకు చెందిన యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో జనసేన పార్టీలో చేరగా పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.



మాజీ మంత్రి ఆనంద్‌బాబుకు చెక్కును అందజేస్తున్న పులివర్తి శేషగిరి రావు

పితృవనం శ్మశాన వాటికకు రూ.18 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి26: నగరంలోని బొంగరాలబీడులోనున్న మహాప్రస్థాన సేవాసమితి ఆధ్వర్యంలో నడుస్తున్న పితృవనం శ్మశాన వాటికకు ప్రముఖ బిల్డర్, వెంకటేష్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత పులివర్తి శేషగిరి రావు రూ.18 లక్షల విరాళాన్ని ప్రకటించారు. సోమవారం మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత నక్కా ఆనందబాబు చేతులమీదుగా నగదు చెక్కును పులివర్తి శేషగిరిరావు కుటుంబ సభ్యులు నిర్వాహకులకు అందజేశారు. పితృవనం శ్మశాన వాటికలో గ్యాస్ ఛాంబర్ ఏర్పాటుకు ఈ విరాళాన్ని వినియోగిస్తామని మహా ప్రస్థానసేవా సమితి అధ్యక్షుడు వెలగపూడి లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ హోమియో వైద్యుడు డాక్టర్ కోటపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. శేషగిరిరావు తన సంపాదనను సేవా కార్యక్రమాలకు వినియోగించడంపై అభినందనలు తెలిపారు. ఆనందబాబు మాట్లాడుతూ బొంగరాలబీడు శ్మశానవాటిక ఇప్పుడు అద్భుతంగా మారిందని, శేషగిరిరావు స్ఫూర్తితో దాతలు ముందుకు రావాలనికోరారు. విరాళం అందుకున్న మహాప్రస్థానం సేవా సమితి అధ్యక్షుడు లక్ష్మణరావు మాట్లాడుతూ బొంగారాల బీడు శ్మశాన వాటికలో త్వరలో మార్చ్యురీని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం న్యాయవాది పులివర్తి శ్రీనివాస్ అధ్యక్షతన సేవాసమితి ఆధ్వర్యంలో శేషగిరిరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సమితి కార్యవర్గం ప్రతినిధులు కల్లూరి వెంకటరమణ, ధనియాల గాంధీ చౌదరి, పులివర్తి కార్తిక్, శేషగిరిరావు కుమారులు డాక్టర్ వెంకటేష్, కమలేష్, కార్తీక్, భాస్కర్ పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్‌కు పటిష్ట భద్రత : కలెక్టర్



ఈవీఎం గోడౌన్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు సీఈవో

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నెలాఖరు తనిఖీలలో భాగంగా సోమవారం గుంటూరు ఆర్డీవో కార్యాలయం ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఎంఎన్ హరేంధ్ర ప్రసాద్‌తో కలిసి తనిఖీ చేసారు. గోడౌన్ షట్టర్లకు వేసిన తాళాల సీళ్ళను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని చర్యలు పకడ్బందీగా తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీవో శ్రేఖర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈవీఎంలనోడల్ అధికారి వేణుగోపాల్, జిల్లా సహాయక అగ్నిమాపక శాఖాధికారి కృష్ణారెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్తుకు చంద్రబాబే భరోసా

● టీడీపీ గుంటూరు తూర్పు ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్

● 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యువత భవిష్యత్తుకు టీడీపీ అధినేత చంద్రబాబుతో భరోసా కల్పిస్తారని అని టీడీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ అన్నారు. పార్టీ తూర్పు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నసీర్ ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తును కాపాడే అవకాశం యువతకు వచ్చిందని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకొని రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వాలని పిలుపునిచ్చారు. కొత్తగా ఓట్లు వచ్చిన వారికి ఓటు వినియోగంపై తర్ఫీదు ఇస్తామని చెప్పారు. ప్రతి ఒక్క యువ ఓటరు తమ ఓటును ఎవరికి వేస్తే ఉపయోగం ఉంటుందో తెలుసుకునే విధంగా 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమాన్ని టీడీపీ చేపట్టిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం, యువతకి ఉద్యోగాల కోసం, సంక్షేమాన్ని, మెరుగైన విద్య కోసం, పరిశ్రమల స్థాపనకోసం,



ఓట్ ఫర్ సీబీఎన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మొహ్మద్ నసీర్

మెరుగైన వైద్యం కోసం, రాజధాని కోసం ఈసారి యువత తప్పనిసరిగా చంద్రబాబుకు ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని యువతలోకి తీసుకు వెళ్లడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టబోతు న్నామని తెలియచేసారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అఫ్రోజ్, జీ. వాణి, ఖాసీంవలి, మహంకాళీ మహేంద్ర, ఫరీద్, అజ్గర్, సత్యం, ఆంజనేయులు, మహంకాళీ నరసింహ రావు, జబి ఖాన్, బత్తిన శంకర్, మల్లెంపూడి శ్రీనివాస్, హఫీజ్, వెల్చూరి కిరణ్ పాల్గొన్నారు



విద్యార్థులను అభినందిస్తున్న కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

అన్వేషణ ప్రొటోటైప్ కాపిటీషన్-2024లో

ఆర్వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 26: ఇటీవల బెంగుళూరులోని బిఎంఎస్ ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో 'అన్వేషణ ప్రొటోటైప్ కాంపిటీషన్ 2024' జాతీయ స్థాయి పోటీల్లో ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థుల ఆవిష్కరణకు నగదు బహుమతి, సర్టిఫికెట్ లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కెమికల్ ఇంజనీరింగ్ 3వ సంవత్సరం విద్యార్థులు జి.మనోజ్, ఎస్ఎస్ శ్రీనాగ్, పి.త్రివేణి, కె.త్రివేణి, సి.రాజశేఖర్, ఎం.ప్రసన్నలు రూపొందించిన 'అడసోర్షన్ అఫ్ టెక్స్ టైల్ డైస్ యూసింగ్ బయో ఆక్టివ్ ఫిల్టర్ బెడ్స్' ఆవిష్కరణకు జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, కళాశాల అధ్యాపకులు తదితరులు అభినందించారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

గుంటూరు సిటీ,ఫిబ్రవరి 26: 0-5 సంవత్సారాల వయస్సు గల పిల్లలందరికి మార్చి 3 వ తేదిన పల్స్ పోలియో చుక్కలు వంద శాతం వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను కోరారు. సోమవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో పల్స్ పోలియో కార్యక్రమంపై జేసీ రాజకుమారి అధ్యక్షతన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జరింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గత ఏడాది లాగే 0- 5 వయస్సు గల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిందాల్ పవర్ ప్రాజెక్ట్ ప్రాంతం సమీపాన ర్యాట్ పిక్కర్స్ వున్నారని, అదే విధంగా తాడేపల్లి లోని ముగ్గురోడ్డు సాయిబాబా మందిరానికి ఎదురుగా వున్న ప్రాంతం లోని పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్ స్వాతి, ఆర్డీవో పీ.శ్రీఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ పలువురు పాల్గొన్నారు.

29లోపు లేబర్ లైసెన్స్ పునరుద్ధరించుకోవాలి

గుంటూరు, ఫిబ్రవరి 26: వ్యాపారవర్గాలు కార్మికశాఖ నుంచి ఈనెల 29 లోపు లేబర్ లైసెన్స్ పునరుద్ధరించుకోవాలని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు పేర్కొన్నారు. జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. వ్యాపారులు కొత్తగా లేబర్ లైసెన్స్ తీసుకోవాలన్నా, పునరుద్ధరించుకోవాలన్నా నిర్ణీత సమయంలో పూర్తి చేసుకోవాలన్నారు. లేకుంటే పెనాల్టీలతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి26: వీవీవీ హెల్త్ హబ్, గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక జేకేసీ రోడ్డులో అండర్ -10, 12, 14, 16 మిక్స్‌డ్ విభాగాల్లో నిర్వహించిన ఏపీ స్టేట్ టెన్నిస్ పోటీలు సోమవారంతో ముగిసాయి. అనంతరం రైమాండ్స్ షోరూమ్ అధినేత టి.అరుణ్‌కుమార్ విజేతలకు బహుమతులు అందజేశారు.

విజేతలు: అండర్-16: ఎం.ప్రణీత (విన్నర్), హితేష్ (రన్నర్),అండర్-14: ఎస్.ఇ.హితేష్ (విన్నర్), ఆదిత్ (రన్నర్), అండర్-12: టి.రోషన్(విన్నర్), టి.అఖిల్(రన్నర్) అండర్-10: యూ.శౌర్య రామ్ (విన్నర్), ఐ ప్రజిత్‌వర్ధన్(రన్నర్)

మార్చి 8న ఉత్తమ మహిళలకు అవార్డుల అందజేత

స్థానిక చంద్రమౌళినగర్‌లోని నాథ్‌వెల్‌నెస్ వరల్డ్‌లో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ స్పోర్ట్స్ మ్యాగజైన్ ఆధ్వర్యంలో మార్చి8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని క్రీడారంగంలో రాణించిన మహిళ లకు ఉత్తమ మహిళా క్రీడా అవార్డులను అందజేస్తున్నట్లు గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జీ.వీ.ఎస్.ప్రసాద్ తెలిపారు.

జిల్లాలో నేటి నుంచి టెట్

● డీఈవో కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 26: జిల్లాలో నేటి మార్చి 3 వరకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్) నిర్వహించనున్నట్లు డీఈవో పీ.శైలజ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందు కోసం 9 కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 17,258 మంది పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ సెంటర్ (9618454467),(9573382616) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు తమ సందేహాలను ఈ సెంటర్ ద్వారా నివృత్తి చేసుకోవాలని డీఈవో పీ.శైలజ సూచించారు.

28న జాబ్ మేళా

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 26: ఈనెల 28న నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పీ.ప్రణయ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్‌మేళాకు అరబిందో పార్మా, ఇన్నోవేసర్స్ సర్వీసెస్ తదితర 16 కంపెనీలు హాజరుకానున్నట్లు తెలిపారు. 18 నుంచి 40 సంవత్సరాలలోపు వయసు ఉండి 10, ఇంటర్, ఐటీఐ డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, పీజీ, డిప్లమో తదితర అర్హతలు ఉన్నవారు హాజరుకావచ్చునని తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు.

తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానం

సాధారణ ఎన్నికల కోసం డేటాఎంట్రీ, ఆఫీస్ సబార్డినేటర్ పోస్టుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 28, 29 తేదీల్లో గుజ్జనగుండ్ల లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు అర్హత డిగ్రీ అర్హత ఉండీ కంప్యూ టర్‌పై ఒక సంవత్సరం అనుభవం ఉండాలి. ఆఫీస్ సబార్డినేట్ పోస్టుకు 8వ తరగతి పాసై ఉండాలి. జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో పేర్లు నమోదు చేసుకుని ఉండాలని సూచించారు. ఇతర వివరాల కోసం 9652065235లో సంప్రదించాలని సూచించారు.

గుర్తుతెలియని యువకుడి దారుణ హత్య

గుంటూరు, ఫిబ్రవరి 26 : స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చేపల మార్కెట్ సమీపంలోని ఉల్లి పాయల కొట్ల వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి(35) దారుణ హత్యకు గురయ్యాడు. సోమవారం ఉదయం గమనించిన స్థానికులు లాలాపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న లాలాపేట సీఐ దేవప్రభాకర్, ఎస్ఐ సుబ్బారావు ఘటనస్థలాన్ని పరిశీలించారు. తొలుత ప్రమాదవశాత్తు మరణించి ఉంటాడని భావించినప్ప టికీ పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిం చగా యువకుడిని రాయితో కొట్టి చంపినట్లు నిర్ధారించారు. సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించగా ఏటీ అగ్రహారంకు చెందిన సిద్దార్థ అనే యువకుడు ఈ హత్యకు పాల్పడి నట్లు గుర్తించారు. కాగా నిందితుడు సిద్దార్థ పరారీలో ఉన్నాడు. అయితే హత్యకు గురైనది ఎవరనేది తెలియ రాలేదు. పోలీసులు అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నారు. వీరిద్దరు ఆదివారం రాత్రిశానిటైజర్ తగినట్లు గుర్తించారు. ఈ క్రమంలోనే వారి మధ్య ఘర్షణ చోటు చేసుకోగా సిద్దార్థ రాయితో ఆ యువకుడిని కొట్టి చంపినట్లు పోలీసులు గుర్తిం చారు. నిందితుడు పట్టుబడితే గాని హతుడు ఎవరనేది తెలియరాదని పోలీసులు తెలిపారు.

స్పందనకు హాజరుకాని

అధికారులపై చర్యలకు ఆదేశం

● పలువురికి షోకాజ్ నోటీసులు ● జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 26 : స్పందనకి అధికారులు సకాలంలో హాజరు కాకుంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేసారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో నిర్వహించిన స్పందనకు హాజరుకాని ఏఈ పవన్, టీపీఎస్ రిజ్వానా, ఈ-1 రంగారెడ్డి, జి-4 మోహన్ రావుకి షోకాజ్ నోటీసులు జారి చేశారు. అనంతరం జగనన్న కాలనీల్లో ఇళ్ల రీజిస్ట్రేషన్లు, ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ, గతవారం స్పందనలో అందిన ఆర్జీల పరిష్కారంపై సమీక్షించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 31 ఫిర్యాదులు అందాయని, ఆయా ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వైద్యచికిత్సలపై వీసీ నన్నపనేని సంతృప్తి

● నాట్కో సెంటర్‌లో అదనపు సౌకర్యాలపై సమీక్ష

గుంటూరు (మెడికల్) ఫిబ్రవరి 26: గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో రోగులకు అందుతున్న వైద్యసేవలను సోమవారం నాట్కో ఫార్మా చైర్మన్ వీసీ నన్నపనేని పరిశీలించారు. ఆయన వెంట నాట్కో ఫార్మా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (కార్పొరేట్ వ్యవహారాలు) నన్నపనేని సదాశివరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న కేన్సర్ వైద్య సేవల పట్ల నన్నపనేని వీసీ సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్లు, నర్సులు అందిస్తున్న వైద్యసేవలు బాగున్నాయని ఆయన అభినందించారు. ప్రతి రోజూ వందల సంఖ్యలో రోగులు వస్తున్నట్లు వైద్యులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా నాట్కో కేన్సర్ సెంటర్‌లో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన డైనింగ్ హాల్‌ను వైస్ ప్రెసిడెంట్ నన్నపనేని సదాశివరావు ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో.. ఇటీవల క్యాన్సర్ సెంటర్‌కు అదనంగా కేటాయించిన



డైనింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న సదాశివరావు, పక్కన వీసీ నన్నపనేని

స్థలంలో ఎటువంటి వసతులు ఏర్పాటు చేయాలనే అంశంపై సూపరింటెండెంట్, వివిధ వైద్య విభాగాధిపతులలో వీసీ నన్నపనేని చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ టీవీ శివరామకృష్ణ, డాక్టర్ మురళీ, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వెంకటరెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, నాట్కో సమన్వయకర్త వై అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న జేసీ రాజకుమారి, డీఆర్వో పెద్ది రోజా

ఆలసత్వం వహిస్తే కఠిన చర్యలు..

● జేసీ రాజకుమారి గణియా ● స్పందనకు 180 అర్జీలు

గుంటూరు,(తూర్పు),ఫిబ్రవరి26: స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ రాజకుమారి గణియా అధికారులను హెచ్చరించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనకు 180 అర్జీలు అందాయి. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, స్వాతి, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీవో పీ.శ్రీకర్‌తో కలసి జేసీ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ రాజకుమారి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అర్జీలు అయా శాఖల ఉన్నాతాధికారులు సమీక్ష జరపాలన్నారు. మండల స్థాయి అధికారులు స్పందనలో విధిగా పాల్గొనాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, డిఈవో శైలజ, డీఎస్‌వో కోమలిపద్మ ఉన్నాతాధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు.. విన్నపాలు :

- పొన్నూరులో రోడ్డు విస్తరణలో భాగంగా శ్రీసాక్షి భవన్నారాయణ ఆలయం నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ఏర్పాటు చేస్తున్న డివైడర్ పనులను నిలిపివేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర ఆ పార్టీ నేతలతో కలసి వినతిపత్రం అందజేశారు. డివైడర్ ఏర్పాటుతో రోడ్డు విస్తీర్ణం తగ్గి రథోత్సవం సమయంలో ఆటంకం ఏర్పడే అవకాశం ఉందన్నారు.

- మేడికొండూరు మండలంలో ప్రభుత్వ కార్యక్రమాల సందర్భంలో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని, కనీసం తనకు సమాచారం ఇవ్వడం లేదని ఆ మండల ఎంపీపీ మన్నవ స్వప్న జేసికి ఫిర్యాదు చేశారు. తాను ఎస్సీ మహిళని అధికారులు, నేతలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు.

- కోవిడ్ సమయంలో జీజీహెచ్‌లో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహించిన తమకు ఇంతరకు చెల్లించలేదని జీతాలు ఎఫ్ఎన్‌వోలు జేసీకి విన్నవించారు. ఈ విషయాన్ని కాంట్రాక్టురును అడిగితే డీఎంహెచ్‌వోను అడగండని దురుసుగా సమాదానం చెబుతున్నారని తెలిపారు.

- కలెక్టర్ బంగ్లా సమీపంలో జిల్లా మహిళా ప్రాంగణంలోని గిరిజన సంక్షేమ కళాశాల, విద్యార్థినుల వసతిగృహంలో 20 రోజుల క్రితం జరిగిన బియ్యం తరలింపు ఘటనపై ఇంతవరకు చర్యలులేవని గిరిజన నేతలు చంద్రనాయక్, పాండునాయక్‌లు వినతిపత్రం అందజేశారు. బియ్యం తరలింపుపై వాస్తవాలు బహిర్గతం చేయకుండా వసతిగృహ విద్యార్థినులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని, దీని వెనుక హెచ్‌డబ్ల్యువో రమాదేవి హస్తం ఉందని ఆరోపించారు.

- రోడ్డు విస్తరణలో భాగంగా మా నివాసాలు కూల్చివేశారని, ఆ సమయంలో జగనన్న ఇంటి పధకంలో మీకు స్థలం ఇస్తామని చెప్పారని, కానీ ఇప్పుడేమో పొజిషన్ సర్టిఫికెట్ పత్రం ఇచ్చారని లాం గ్రామస్థులు పలువురు వినతిపత్రం అందజేశారు. దీనిపై అనేక మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఉన్నాతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

- చేయూత పథకంలో తన పేరు అర్హుల జాబితా నుంచి ఎందుకు తొలిగించారని అడిగినందుకు వైసీపీనేతలు మర్రిపూడి శ్రావణ్‌కుమార్, బర్రా నాగరాజు అనే వ్యక్తులు తన భార్యపై దాడి చేసారని కొల్లిపర గ్రామానికి చెందిన రంపాటి వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదని జేసీకి విన్నవించారు.

- అపరిష్కృత సమస్యలను వారంలోపు పరిష్కరించాలని, లేని పక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్తామని ఉపాధి హామీ పథకంలో పనిచేసే సిబ్బంది స్పష్టంచేశారు. ఈ మేరకు స్పందనలో జేసీకి సమ్మె నోటీసును అందజేశారు. బీఎఫ్‌టీ, కో-యూనియన్, టీఏ అసోసియేషన్ల ఉద్యోగులందరూ సమ్మెలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు చలపతిరావు, సురేష్, రవి అరుణ, రామరాజు, జయ బార్గవి, సయ్యద్, దీప్తి తదితరులు ఉన్నారు.

- తాడేపల్లి ఏసీసీ (అసోసియేట్ సిమెంట్ అసోసియేషన్) కంపెనీ 1993లో అక్రమంగా లాకౌట్ ప్రకటించిందని, కానీ ఇప్పటివరకు కార్మికులకు నష్ట పరిహారం ఇవ్వకుండా వేధిస్తుందని యూనియన్ ప్రధాన కార్యదర్శి కూరపాటి స్టీవెన్ అన్నారు. న్యాయం చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట కార్మిక కుటుంబాలు ధర్నా నిర్వహించి, జేసీకి వినతిపత్రం అందజేశారు.

సేవా చారిటబుల్ ట్రస్ట్ పేరుతో ఘరానా మోసం

●తక్కువ ధరకు వస్తువులంటూ కోట్లు వసూలు చేసి అదృశ్యమైన ముఠా

● గ్రీవెన్స్‌లో ఎస్పీని ఆశ్రయించిన బాధితులు

గుంటూరు, ఫిబ్రవరి 26 : ప్రజా చారిటబుల్ ట్రస్ట్ పేరుతో ఓ ముఠా ఘరానా మోసానికి పాల్పడింది. ట్రస్టులో సీఎం జగన్మోహన్ రెడ్డి సతీమణి వైయస్ భారతి , అదేవిధంగా మాజీమంత్రి కొడాలి నాని కీలకంగా ఉన్నారని ప్రచారం చేసి, తక్కువ ధరకే సరుకులు అంటూ మోసాలకు పాల్పడి రూ. కోట్ల వసూళ్లకు పాల్పడిన ముఠా రాత్రికి రాత్రి అదృశ్యమైంది. దీంతో సోమవారం పలువురు బాధితులు పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు.. ఫిరంగిపురం పరిధిలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన నల్లమోతు శ్రీనివాసరావు, పాత గుంటూరు బాలాజీ నగర్ కు చెందిన వలేటి అనంతలక్ష్మి అనే ఇద్దరు కలిసి ప్రజా సేవా చారిటబుల్ ట్రస్ట్‌ను ప్రారంభించారు. తమ ట్రస్టులో సభ్యులుగా చేరిన వారికి ఏ వస్తువైనా తక్కువ ధరకే ఇస్తామని నమ్మించారు. ఆ తర్వాత నుంచి డబ్బులు కట్టించుకుంటూ ఒక్కొక్కరు వద్ద నుంచి రూ. 50 వేల నుంచి నాలుగైదు లక్షల వరకు వసూలు కోట్లలో కొల్లగొట్టినట్లు బాధితులు వాపోయారు. సుమారు 300 మంది వరకు బాధితులు ఉంటారని, మూడు కోట్లకి పైగానే వసూలు చేశాడని బాధితులు ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరిపై చర్యలు తీసుకుని తమ డబ్బు తమకు ఇప్పించాలని బాధితులు వాపోయారు.

స్థలం లేకపోయినా తప్పుడు డాక్యుమెంట్లతో రూ. లక్షల్లో మోసాలు

ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన కే.విజయ్‌కుమార్ రెడ్డి, జి సత్యనారాయణ అనే ఇద్దరు ఇరిగేషన్‌శాఖలో సీనియర్ అసిస్టెంట్స్‌గా పనిచేస్తున్నారు. నగరంలోని ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేస్ వన్ లో రెడ్డిపాలెం పంచాయతీలో ప్లాట్లు విక్రయిస్తామని విజయవాడకుచెందిన రియల్ ఎస్టేట్ బ్రోకర్ సూర్యనారాయణ, ఇరిగేషన్ శాఖలో పనిచేసే విజయ్ కుమార్‌రెడ్డి , సత్యనారాయణ లను కలిసి నమ్మించాడన్నారు. విజయకుమార్ రెడ్డికి రెడ్డిపాలెం సమీపంలో 102 చదరపు గజాల స్థలాన్ని రూ. 25 లక్షలకు విక్రయించాడన్నారు. అదేవిధంగా సత్యనారాయణకు 117 గజాల స్థలాన్ని కూడా 25 లక్షల విక్రయించాడన్నారు. వీరిలో ఒకరికి గుంటూరులోనూ,మరొకరికి విజయవాడలోనూ రిజిస్ట్రేషన్ చేశాడు అన్నారు. ఒక్కొక్కరు వద్ద రు 25 లక్షలు చొప్పున ఇద్దరి వద్ద రూ.50 లక్షలు తీసుకున్నాడన్నారు. విజయవాడ సింగ్ నగర్‌కు చెందిన మెట్ల బాల గురవయ్య అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి మోసం తాగబడి నట్లు బాధితులు తెలిపారు. అయితే బ్యాంకు వారు ఆయా ప్లాట్లను రీ సర్వే చేయగా అసలు ఆ స్థలమే అక్కడ లేదని, డాక్యుమెంట్లు ఫేక్ అని నిర్ధారణ అయింది. దీంతో బ్యాంకు వారు తమకు నోటీసులు పంపారని బాధితులు వాపోయారు.

ప్రకటన

యిందుమూలంగా ప్రజల యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, కుంచనపల్లి గ్రామ వాస్తవ్యులైన నిమ్మల వెంకటేశ్వరరావు గారి కుమారుడు గోపీనాథ్ దిగువ షెడ్యూలు దాఖలాస్తిని గుంటూరు జిల్లా, దుగ్గిరాల మండలం, పెదకొండూరు గ్రామ కాపురస్తులైన లేటు బండపల్లి అక్కయ్య గారి కుమారుడు 1) కోటయ్య వీరి కుమారుడు 2) సురేష్ బాబు వద్ద నుండి కొనుగోలు నిమిత్తము అగ్రిమెంటు పొందివున్నారు. కావున దిగువ షెడ్యూలు దాఖలాస్తిపై ఎవరికైనను ఏమైనను హక్కులు, క్షయిములు, జప్తులు అభ్యంతరములు వున్నచో సంబంధిత ఒరిజినల్ దస్తావేజులతో ఈ ప్రకటన వెలువడిన రెండు వారములలోగా దిగువ అడ్రసు దారునికి స్వయంగా గాని రిజిష్టరు లెటరు ద్వారా గాని మీ మీ అభ్యంతరములు తెలియజేయగలరు. లేనిచో సదరు ఆస్తి నిర్వివాదమైనదని నిర్ణయించుకుని నా క్లయింటు సంబంధిత రిజిష్టరు వారి కార్యాలయములో రిజిష్టరు దస్తావేజును పొందగలరు. తదుపరి వచ్చిన ఎటువంటి అభ్యంతరములు చెల్లనేరవు.

షెడ్యూలు : గుంటూరు జిల్లా, దుగ్గిరాల సబ్ డివిజన్, పెదకొండూరు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన పెదకొండూరు గ్రామ డి.నెం. 385రు య. 7-09 సెంట్లు మింజువలె విక్రయ అగ్రిమెంటు పొందిన య. 0-66.67 సెంట్లు మెరక భూమికి **హద్దులు :** తూర్పు : పిరాట్ల వెంకటేశ్వర్లు గారి భూమి హద్దు, దక్షిణం : కృష్ణ కరకట్ట మార్జిన్ హద్దు, పడమర : దున్నా నాగేశ్వరరావు గారి భూమి హద్దు, ఉత్తరం : సొసైటీ భూమి హద్దు. ఈ హద్దుల మధ్య య. 0-66.67 సెంట్లు లేక చ.మీ. 2698.04రు మెరక భూమి.

P.V.S. SATYANARAYANA, B.Sc., M.Ed., B.L.
Advocate
40-15/1-19/2, Flat No. 1A3,
Rajasree Residency, Labbipeta,
Sindhu Bhavan Road, Brundavan Colony,
Vijayawada - 520010.
ది. 26-02-2024

మౌర్యుల అనంతరం రాజ వంశాలు

శుంగవంశం

క్రీ.పూ.185లో చివరి మౌర్య రాజైన బృహద్రదుడిని చంపి అతని సేనాని పుష్యమిత్రుడు 'శుంగ' వంశాన్ని స్థాపించాడు. మగధను రాజధానిగా చేసుకుని పాలించాడు. ఇతని కాలం లోనే అయోధ్య శాసనాన్ని ధనదేవుడు చెక్కించాడు.

పుష్యమిత్రుని సమకాలీనులు: పంజాబ్, కాబూల్ ప్రాంతాలను పాలిస్తున్న ఇండో గ్రీకు రాజు మినాండర్, కళింగ రాజు ఖారవేలుడు, శాతవాహన రాజు మొదటి శాతకర్ణి ఇతని సమకాలీనులు. అయితే అశ్వమేథ యాగం సందర్భంగా పుష్యమిత్రుని మినాండర్ ఓడించినట్లు తెలుస్తోంది.

శుంగ వంశ చరిత్రకు ఆధారాలు: పతంజలి- మహాభాష్యం, కాళిదాసు- మాళవికాగ్నిమిత్రం, పాణిని - అష్టాధ్యాయి, బాణుడు- హర్ష చరిత్ర, బౌద్ధ గ్రంథం- దివ్యావదన మొదలైనవి. ఉజ్జయిని రాకుమార్తె మాళవికను పుష్యమిత్రశుంగుని కుమారుడైన అగ్నిమిత్రుడు రాక్షస వివాహం చేసుకున్న ఇతివృత్తమే కాళిదాసు 'మాళవికాగ్నిమిత్రం'.

శుంగుల మత విధానం: శుంగుల కాలంలో వైదిక (బ్రాహ్మణ) మతం పునరుద్ధరణ జరిగింది.(దేవభూతి క్రీ.శ.72లో కణ్వ వంశీయుడైన వాసుదేవ కణ్వ చేతిలో మరణించాడు. దీంతో కణ్వవంశ స్థాపన జరిగి, శుంగ వంశం అంతరించింది).

- పుష్యమిత్ర శుంగుని కాలంలో సాంచి, బార్హుత్ స్థూపాలకు వాస్తుపరమైన అలంకరణ చేశారు. దీనిని బట్టి పరమత సహనం ఉన్నట్లు అర్థమవుతుంది. పుష్యమిత్రుడు అనేక మంది బౌద్ధులను సంహరించినట్లు పలు బౌద్ధ గ్రంథాల్లో రాసి ఉంది. కాని బిహార్, అయోధ్య, మాళ్వా ప్రాంతాల్లో బౌద్ధ విహారాలు శుంగుల కాలంలోనే వర్ధిల్లినట్లు 'మహావంశం' అనే బౌద్ధ గ్రంథం పేర్కొంటోంది.
- చివరి శుంగ రాజులలో గొప్ప వాడైన భగబద్రరాజు ఆస్థానంలో గ్రీకు రాయబారి హీలియోడోరిస్ (గ్రీకు రాజైన ఆంటియోకిడాన్ ఆస్థానం నుంచి వచ్చాడు) చేరాడు. ఈయన భిల్సా దగ్గర ఉన్న బేస్‌నగర్‌లోని విష్ణుదేవాలయంలో గరుడ స్తంభాన్ని ప్రతిష్ఠించాడు. ఇక్కడే శాసనం కూడా చెక్కించాడు. భాగవతమతం, వాసుదేవ కృష్ణుని గురించి వివరించాడు. రాజకీయంగా చూస్తే... పుష్యమిత్రుని తర్వాత వసుమిత్రుడు, దేవభూతి, భగబద్రుడు మొదలైన వారు పరిపాలించారు. వీరందరి కాలంలో అన్ని మతాలు అభివృద్ధి చెందాయి. వసుమిత్రుడు కోసల రాజు మూలదేముడు చేతిలో హత్యకు గురయ్యాడు.
- శుంగ రాజ్యంలో పాంచాల, కోశాంబి రాజ్యాలు లేవు. అవి అప్పటికే మగధ నుంచి విడిపోయాయి. అంటే శుంగులు మగధను మాత్రమే పాలించారు.

శుంగుల కాలం నాటి ముఖ్యాంశాలు

- వైదిక మతాన్ని, ఆచారాలను, హైందవ పద్ధతులను పునరుద్ధరించారు. సంస్కృత భాషకు ఆదరణ పెరిగింది. పాళి, ప్రాకృత భాషల ప్రాధాన్యం తగ్గింది.
- వాయువ్య సరిహద్దుల వద్ద గ్రీకుల దాడుల నుంచి భారత దేశాన్ని కొన్ని సంవత్సరాల వరకు మాత్రమే కాపాడగలిగారు. ఈ కాలంలో సాంచీ స్థూపానికి తోరణాన్ని అద్భుతంగా చెక్కించారు. తర్వాత శాతవాహన రాజు శాతకర్ణి దీనికి తుది మెరుగులు పెట్టించాడు.
- క్రీ.పూ. రెండో శతాబ్దంలో పాణిని రచించిన వ్యాకరణానికి పతంజలి వ్యాఖ్యానం రాశాడు. దీని పేరు 'మహాభాష్యం'.
- శుంగులు అశ్వమేథయాగాలు చేశారు. వీరి ప్రధాన దైవం విష్ణువు. వీరి కాలంలో భాగవతం ప్రాముఖ్యం పెరిగింది. అయోధ్య శాసనంలో పుష్యమిత్రుడు రెండు అశ్వమేథయాగాలు చేసినట్లు రాసి ఉంది.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ హిస్టరీ

మౌర్యులు - శుంగుల శిల్పకళలో భేదాలు

శుంగుల శిల్పకళపై విదేశీ ప్రభావం లేదు. మౌర్యుల శైలికి భిన్నమైన శైలి వీరిది. వీరి కాలంలో బౌద్ధ స్థూపాల నిర్మాణాలు మాత్రమే జరిగాయి. చైత్యాలు, విహారాలు నిర్మించలేదు. వీరిది మౌర్యుల శిల్పంలా గుండ్రటి రూపం కాదు. అర్ధాకార రీతిలో ఉన్నాయి. మౌర్యుల శిల్పకళ కథకు సంబంధం లేని శిల్పాలు. కాని శుంగులవి జాతక కథలను తెలిపే శిల్పాలు. మౌర్యుల శిల్పాలు ఎక్కువగా జంతువులకు సంబంధించినవి. ఉదాహరణకు...

- ఒకీరా వద్ద సింహస్తంభం - ఎలాంటి అలంకరణ లేదు
- రామ్ పూర్వాస్తంభం - దీనిపై ఏనుగు శిఖరం ఉంది
- లౌరియానందన్‌గర్ - దీని శిఖరంపై సింహం ఉంది
- రుమ్మిందై స్తంభం(నేపాల్) - గుర్రం ఉంది
- సార్‌నాథ్ - దీని శిఖరంపై నాలుగు సింహాలు ఉన్నాయి.

శుంగుల శిల్పాలలో ఎక్కువగా మానవ ఆకారాలు ఉన్నాయి. ఉదాహరణకు బార్హుత్ స్థూపంపై అజాత శత్రు తన తండ్రి బింబిసారుని చంపినందుకు ప్రాయశ్చిత్తం చెప్పవలసిందిగా బుద్ధున్ని అర్థిస్తున్న శిల్పం అద్భుతంగా చెక్కారు.

- మౌర్యుల శిల్పకళను చక్రవర్తులు, బౌద్ధ సంఘాలు, ధనికులైన ప్రజలు పోషించారు. మౌర్యుల కళలలోని పరిణితి శుంగుల శిల్పాలలో కనిపించదు. మౌర్యుల కళపై పర్షియన్ల ప్రభావం ఎక్కువ. శుంగుల కళ స్వదేశీయమైనది. పశ్చిమాసియ శిల్ప కళ ప్రభావం లేక పోలేదు.
- మౌర్యుల శిల్పాలు విడి విడిగా ఉండగా, శుంగుల శిల్పాలు పెద్ద పెద్ద కళా ఖండాల మీద చెక్కారు. శుంగుల చిత్రాలను 'చరణ చిత్రాలు' అంటారు. బౌద్ధానికి చెందినవి. వస్త్రంపై బుద్ధుడి జీవిత విశేషాలు చిత్రీకరించారు. మౌర్యుల కళ లౌకికమైనది.

క్షాత్రప రాజులు

వీరు శకుల వద్ద అధికారులుగా పని చేశారు. తరవాత కొంత కాలం కుషాణులకు కూడా సామంతులుగా ఉన్నారు. క్షాత్రపులందరిలో పశ్చిమ క్షాత్రపులు గొప్పవారు. వీరిలో గొప్పవాడు నహపాణుడు.

నహపాణుడు: శాతవాహనుల నుంచి మహారాష్ట్రను జయించాడు. బరోచ్(గుజరాత్), మహారాష్ట్ర, అజ్మీర్(రాజస్థాన్), మాళ్వా(మధ్యప్రదేశ్) మొదలైన ప్రాంతాలను ఇతను పాలించాడు. నహపాణుడు స్వతంత్రంగా పాలించిన మొదటి క్షాత్రపరాజు. హిందూ సంప్రదాయాలను పాటించాడు. ఇతని భార్య బౌద్ధులకు గుహాలయాలను నిర్మించింది. ఉజ్జయిని క్షాత్రపులలో తొలిరాజు యశోవర్మన్. వీరి వంశం పేరు 'కర్దమక'. తరవాత రాజు చష్టణుడు. ఉజ్జయిని క్షాత్రపులలో చివరి రాజు రుద్రదాముడు. చష్టనుని కాలం నుంచి వీరు కుషాణులకు సామంతులయ్యారు.

జునాగఢ్ శాసనం: దీనిని రుద్రదమనుడు రాయించాడు. ఇతని గురించిన వివరాలే ఈ శాసనంలో ఎక్కువగా ఉన్నాయి. క్రీ.శ.150లో రుద్రదమనుని పాలన ప్రారంభమైంది. గౌతమీపుత్ర శాతకర్ణి ఇతనికి సమకాలీనుడు. రుద్రదమనుడు మాళ్వా, సౌరాష్ట్ర(గుజరాత్), కచ్, కొంకణతీరం, తూర్పు పంజాబ్, వింధ్యా ఆరావళి పర్వతాల పశ్చిమ ప్రాంతాలను జయించాడు.

- చంద్రగుప్త మౌర్యుని కాలంలో గుజరాత్‌లో నిర్మించిన 'సుదర్శన చెరువు'కు పన్నులు విధించి, మరమ్మతులు చేయించాడు. రుద్రదామునికి సంగీత, తర్క, వ్యాకరణ శాస్త్రాల్లో ప్రావీణ్యం ఉండేది.
- చివరికి శకులు, పహ్లవులు, స్వదేశీ హిందూ సంస్కృతిలో కలిసిపోయారు. హిందూ దేవతలను ఆరాధించారు.

బార్హుత్ స్థూపం ప్రాధాన్యం



ఈ స్థూపాన్ని అశోకుడు నిర్మించాడు. కాని దీని చుట్టూ గల వేదిక లేక ప్రాకార తోరణాలు క్రీ.పూ.150 నాటి శుంగుల కాలంలో నిర్మించారు. బార్హుత్ స్థూపంలో అప్సరసల శిల్పాలు కూడా ఉన్నాయి. ఈ స్థూపం మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లాలో ఉన్న ఒక గ్రామంలో ఉంది. దీనిపై ఉన్న అంశాలను అలెగ్జాండర్ కన్నింగ్ హోం గాంధార నుంచి వచ్చినట్లుగా గుర్తించాడు. క్రీ.శ.1873లో అలెగ్జాండర్ కన్నింగ్‌హోమ్ బార్హుత్ స్థూపాన్ని సందర్శించాడు. మరుసటి సంవత్సరం స్థలాన్ని తవ్వాడు. జోసఫ్ డేవిడ్ బెగ్లర్ సహాయకుడిగా పనిచేశాడు. ఈ బౌద్ధశైలి భారతీయ కళ ప్రారంభ దశను సూచించడం, బౌద్ధ చిహ్నంతో ఇండో-గ్రీకు సైనికుడిగా భావించే విదేశీయుడి విగ్రహం ఉండటం... దీనిలోని ప్రత్యేక శైలి.

సాంచి స్థూపం: మొదట అశోకుడు దీనిని నిర్మించాడు. తర్వాత శుంగులు దీనిపై రాతి కప్పు నిర్మాణం చేశారు. దీనిని ఇటుకలతో నిర్మించారు. రాతి అండం, పెద్ద ఛత్రం, వేదిక నిర్మించారు. ఈ స్థూపం తోరణాలపై గల శిల్పాలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి.



డాక్టర్ ఐ.నీలా,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల, సూర్యాపేట.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/FpZEgVDలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఆర్‌సీబీలో ఎంఎస్-పీహెచ్‌డీ

కేంద్ర ప్రభుత్వానికి చెందిన రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ, ఫరీదాబాద్)- ఎంఎస్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదు నుంచి ఏడేళ్ల వరకు ఉంటుంది. సెమిస్టర్ విధానాన్ని అనుసరిస్తారు. నిర్దేశిత రుసుం చెల్లించి భోజన, వసతి సౌకర్యాలు పొందవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. విదేశీ విద్యార్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.



అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సైన్స్, ఇంజనీరింగ్, మెడిసిన్ విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ(గ్యాట్ బీ) వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ, విదేశీ విద్యార్థులకు ఫీజు లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** rcb.res.in

ఇన్స్యూరెన్స్ అకాడమీలో పీజీడీఎం

పుణెలోని నేషనల్ ఇన్స్యూరెన్స్ అకాడమీ(ఎన్ఐఏ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో మొత్తం 180 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌కు ఏఐసీటీఈ, ఏఐయూ, ఎన్‌బీఏ గుర్తింపులు ఉన్నాయి. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్(ఏఐయూ) దీనిని ఎంబీఏ డిగ్రీకి సమానమైనదిగా గుర్తించింది.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో ఫైనాన్స్, హెచ్‌ఆర్, మార్కెటింగ్, అనలిటిక్స్, టెక్నాలజీ సంబంధిత కోర్ సబ్జెక్టులతో పాటు జనరల్ ఇన్స్యూరెన్స్, లైఫ్ ఇన్స్యూరెన్స్, రీ-ఇన్స్యూరెన్స్ అండ్ పెన్షన్ సబ్జెక్టులు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఎనిమిది వారాల సమ్మర్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023/ఎక్స్‌ఏటీ 2024/సీమ్యాట్ 2024 అర్హత పొంది ఉండాలి. క్యాట్ 2023లో కనీసం 75 పర్సంటైల్, ఎక్స్‌ఏటీ 2024లో కనీసం 85 పర్సంటైల్, సీమ్యాట్ 2024లో కనీసం 95 పర్సంటైల్ ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 28 ఏళ్లు మించకూడదు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు రిజర్వేషన్ నిబంధనలు వర్తిస్తాయి.

ఎంపిక: అభ్యర్థులను అకడమిక్ ప్రతిభ, ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం, జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 15
- **వెబ్‌సైట్:** pgdm.niapune.org.in

జాబ్ కార్నర్

ఇండియన్ నేవీలో ఎస్ఎస్‌సీ ఆఫీసర్లు

ఎజిమల(కేరళ)లోని ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏ)లో 2025, జనవరి నుంచి ప్రారంభమయ్యే షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది.

బ్రాంచి వివరాలు: జనరల్ సర్వీస్: 50, పైలెట్: 20, నావల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్: 18, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్: 8, లాజిస్టిక్స్: 30, నావల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్: 10, ఎడ్యుకేషన్: 18, ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్): 30, ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్): 50, నావల్ కన్‌స్ట్రక్టర్: 20.

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 24

వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in/

సెయిల్‌లో టెక్నీషియన్‌లు

ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ.. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్)... వివిధ విభాగాల్లో ఆపరేటర్ కమ్ టెక్నీషియన్(ట్రెయినీ)-(ఓసీటీటీ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 324 (మెటలర్జీ: 57, ఎలక్ట్రికల్: 64, మెకానికల్: 100, సివిల్: 22, కెమికల్: 18).

అర్హతలు: పదో తరగతి లేదా తత్సమాన ఉత్తీర్ణతతో పాటు సంబంధిత సబ్జెక్టులో ఇంజనీరింగ్ డిప్లొమా చేసి ఉండాలి. ఓసీటీటీ-డ్రాఫ్ట్స్‌మన్ పోస్టుకు ఏడాది పాటు డ్రాఫ్ట్స్‌మన్/డిజైనర్‌గా పని అనుభవం ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 18

వెబ్‌సైట్: https://sail.co.in/

నవ్య | చిత్రజ్యోతి



హాలీవుడ్‌లో రిలీజ్ అనుకున్నాం

శ్రీవిష్ణు

శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ముఖ్య తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'ఓం భీమ్ బుష్'. 'హుషారు' ఫేమ్ శ్రీ హర్ష కొనుగంటి దర్శకుడు. వి. సెల్యులాయిడ్, సునీల్ బలుసు నిర్మాతలు. మార్చి 22న ఈ చిత్రం విడుదలవుతోంది. సోమవారం చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీ విష్ణు మాట్లాడుతూ 'ఈ సినిమాను ఇంగ్లీష్‌లో తీసి హాలీవుడ్‌లో రిలీజ్ చేయాలనుకున్నాం. ఇలాంటి పాయింట్‌తో ఇప్పటివరకూ ఏ సినిమా రాలేదు. మా ముగ్గురి పాత్రలూ ప్రేక్షకులకు విపరీతంగా నచ్చుతాయి. రెండు గంటల పాటు నవ్వుతూనే ఉంటారు. గుప్తనిధుల కోసం ముగ్గురు శాస్త్రవేత్తలు చేసిన ప్రయాణం ఆసక్తికరంగా ఉంటుంది' అని చెప్పారు. ట్రైలర్, సినిమా అద్భుతంగా ఉంటాయని ప్రియదర్శి చెప్పారు. దాదాపు ఏణ్నార్థం స్పేస్ షూట్‌లో షూటింగ్ చేశాం అని రాహుల్ రామకృష్ణ తెలిపారు. ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్, అయేషాఖాన్, శ్రీకాంత్ అయ్యంగార్, ఆదిత్య మీనన్ కీలకపాత్రలు పోషించారు. సంగీతం: సన్నీ ఎంఆర్. సినిమాటోగ్రఫీ: రాజ్ తోట

ఇకమీదట ఇలాంటివి వద్దు



మోహన్‌బాబు

'కొంతమంది స్వార్థపరులు వారి రాజకీయ లబ్ధి కోసం నా పేరును ఉపయోగించుకొంటున్నట్లు తెలిసింది. మీరు ఏ పార్టీ వారైనా మీ ప్రయోజనాల కోసం నా పేరును వాడుకోవద్దు' అని మోహన్‌బాబు విజ్ఞప్తి చేశారు. ఇక మీదట ఇలాంటివి పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన సోమవారం సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. ఎవరిష్టం వారిది, చేతనైతే నలుగురికి సాయపడాల్సింది పోయి ఏ సంబంధం లేనివారిని రాజకీయాల్లోకి లాగడం బాధాకరమని ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో మోహన్‌బాబు కీలకపాత్ర పోషిస్తున్నారు.

అందగత్తెగా అలరించాలనుంది



'హీరోయిన్ అవ్వాలనే నా చిన్ననాటి కలను టాలీవుడ్ నిజం చేసింది. అందుకు తెలుగు పరిశ్రమకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఇప్పుడు గ్లామర్ పాత్రల్లో ప్రేక్షకులను అలరించాలనేదే నా లక్ష్యం' అని హీరోయిన్ రాశి సింగ్ చెప్పారు. శివ కందుకూరి హీరోగా పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించారు. మార్చి 1న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాశి సింగ్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- మాది రాయ్‌పూర్. ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకున్నాను. ఎయిర్‌హోస్టెస్‌గా ఉద్యోగం చేశాను. చిన్నప్పటి నుంచే హీరోయిన్ అవ్వాలనుకున్నాను. 'ప్రేమ్‌కుమార్, పాపం పసివాడు' సినిమాల్లో నటించాను. కథానాయికగా మంచి పాత్రలు దక్కుతున్నందుకు ఆనందంగా ఉంది. మున్ముందు వైవిధ్యమైన పాత్రలతో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకోవాలనేది నా కోరిక.
- అనుకోకుండా 'భూతద్ధం...' ఆడిషన్‌కు వెళ్లి హీరోయిన్‌గా ఎంపికయ్యాను. మా దర్శకుడు తను రాసుకున్న పాత్రకు నేను సరైన ఎంపిక అని భావించారు. ఈ సినిమాలో నా పాత్ర పేరు లక్ష్మి. తనో జర్నలిస్ట్. ఆధునిక భావాలున్న యువతిగా కనిపిస్తాను. కథ విన్నప్పుడు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాను. సస్పెన్స్, థ్రిల్, రొమాన్స్ పాటలు... ఇలా అన్నీ ఈ చిత్రంలో ఉన్నాయి.

ఒక యోధుడి ప్రేమకథ



సిద్ధార్థ్ మల్హోత్రా, రాశీఖన్నా జంటగా నటించిన హిందీ చిత్రం 'యోధ'. దిశాపటానీ కీలకపాత్ర పోషించారు. దర్శక ద్వయం సాగర్ ఆంబ్రే, పుష్కర్ ఓజా దర్శకత్వం వహించారు. ధర్మ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మించింది. మార్చి 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే యూనిట్ ఈ చిత్రం నుంచి తొలి గీతాన్ని విడుదల చేసి ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. 'యోధ' ప్రమోషన్స్‌లో భాగంగా సోమవారం సిద్ధార్థ్ మల్హోత్రా, రాశీ ఖన్నా తెలుగు మీడియాతో ముచ్చటించారు. సిద్ధార్థ్ మాట్లాడుతూ "యోధ' యువతలో దేశ భక్తిని, ధైర్యాన్ని పెంపొందించే ఆసక్తికర కథతో తెరకెక్కింది. ఈ సినిమాలో భాగమవ్వడమే ఒక అసాధారణ ప్రయాణం. ప్రేక్షకులను ఈ చిత్రం తప్పకుండా అలరిస్తుంది' అన్నారు. రాశీ ఖన్నా మాట్లాడుతూ "యోధ'లో పనిచేయడం ఒక ఉత్తేజకర అనుభవం. ధైర్యం, ప్రేమ కలబోతగా తెరకెక్కిన చిత్రమిది. ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుంది' అని చెప్పారు.

కృష్ణ నిర్యాణం నుంచి కల్కి అవతారం వరకు



దేశవ్యాప్తంగా సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ప్రభాస్ కథానాయకుడు కావడం, కమల్ హాసన్ ప్రతినాయకుడిగా కనిపించనుండడం సినిమాపై క్రేజ్‌ను పెంచాయి. ఇక ప్రతిభావంతుడైన దర్శకుడిగా పేరు పొందిన నాగ్‌అశ్విన్ విజన్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. ఊహకు అందని స్థాయిలో ఆయన 'కల్కి' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని ప్రచార చిత్రాలతోనే తెలుస్తోంది. ఆయన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా 'కల్కి' కథకు సంబంధించిన విశేషాలను వివరించారు. 'మహాభారత గాథ, 'స్టార్ వార్స్' సినిమాలు నాకు చాలా ఇష్టం. ఈ రెండు విభిన్న ప్రపంచాలను కలుపుతూ ఓ సినిమా చేయాలనే ఆలోచనలోంచి 'కల్కి' చిత్రం పుట్టింది. ఈ సినిమా కథ మహాభారత కాలం నాటి శ్రీకృష్ణ నిర్యాణంతో మొదలై కల్కి అవతారం వరకూ సాగుతుంది. అందుకే టైటిల్ అలా పెట్టాం. మొత్తం ఆరు వేల సంవత్సరాల కథ ఇది. గతం నుంచి భవిష్యత్తులోకి చేసే ప్రయాణం. మున్ముందు ప్రపంచం ఎలా ఉంటుందో చూపించే ప్రయత్నం చేశాం. దానికోసం అద్భుతమైన ఊహా ప్రపంచాన్ని సృష్టించాం. 'బ్లేడ్ రన్నర్' లాంటి హాలీవుడ్ చిత్రానికి అనుకరణగా అనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవడం సవాల్‌గా అనిపించింది. ఏఐ టెక్నాలజీ ఉపయోగించకుండా మా సృజనకు పదునుపెట్టి చాలా కష్టపడి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం' అని చెప్పారు. మే 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. దిశాపటానీ, దీపికా పదుకొనే కథానాయికలు. అమితాబ్ బచ్చన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.

గజల్ గాయకుడు పంకజ్ ఉధాస్ కన్నుమూత



"చిట్టి ఆయీ హై", "ఔర్ ఆహిస్తా కీజియే బాతే" అంటూ మధురమైన గానంతో సంగీత ప్రియులను మైమరపించిన ఆ గొంతు మూగబోయింది. ప్రముఖ గజల్, నేపథ్య గాయకుడు పంకజ్ ఉధాస్ (72) ఇక లేరు. దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య ఫరీదా, కూతుళ్లు రేవా, నయాబ్ ఉన్నారు. పంకజ్ ఉధాస్ మరణ వార్తను నయాబ్.. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించారు. చాలా బరువైన హృదయంతో.. పద్మశ్రీ పంకజ్ ఉధాస్ కన్నుమూశారని తెలియజేయడానికి మేము చింతిస్తున్నామని ఆమె ప్రకటించారు. మంగళవారం పంకజ్ ఉధాస్ అంత్యక్రియలు జరగనున్నాయి. "నామ్", "సాజన్", "మొహ్రా" వంటి అనేక హిందీ చిత్రాలకు పంకజ్ ఉధాస్ గాత్రదానం చేశారు. పంకజ్ గుజరాత్‌లో సంగీత నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి కేశుభాయ్ తీగల వాయిద్యం దిల్రుబాను వాయించే వారు. ఆయన ఇద్దరు సోదరులు మన్హర్ ఉధాస్, నిర్మల్ ఉధాస్ కూడా గాయకులే. 1986లో విడుదలైన నామ్ చిత్రంలోని "చిట్టి ఆయీ హై" పాటతో ఆయన ప్రొఫెషనల్ సింగర్‌గా గుర్తింపు పొందారు. ఆ తర్వాతి నుంచి ఆయన చాలా ఆల్బమ్‌లను రికార్డు చేశారు. 2006 సంవత్సరంలో భారత ప్రభుత్వం పంకజ్ ఉధాస్‌ను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/gI8Gctj లో చదవండి.



'యువత, కందిరీగ' తదితర చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన అక్ష పర్దాసానీ ఓ ఇంటివారయ్యారు. తన స్నేహితుడు, సినిమాటోగ్రాఫర్ కౌశల్‌ను సోమవారం పెళ్లాడారు. ఆ ఫొటోలను అక్ష ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు.

అలరించే అమ్మపాట



విశ్వ కార్తిక్, ఆయుషి పటేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'కలియుగం పట్టణంలో'. రమాకాంత్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, జి. మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్ సంయుక్తంగా నిర్మించారు. మార్చి 22న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. సోమవారం దర్శకుడు వశిష్ఠ చేతుల మీదుగా 'జో జో లాలీ అమ్మ' అంటూ సాగే గీతాన్ని విడుదల చేశారు. పాట చాలా బావుందని యూనిట్‌ను ఆయన అభినందించారు.

కాన్సెప్ట్ మెప్పించింది



విరాన్ ముత్తంశెట్టి కథానాయకుడిగా వేణు మురళీధర్ వి. దర్శకత్వం వహించిన చిత్రం 'ముఖ్య గమనిక'. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటోందని చిత్రబృందం సంతోషం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'కంటెంట్ బాగుంటే చిన్న సినిమా అయినా తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారు అనడానికి మా చిత్రమే ఉదాహరణ. రోజురోజుకూ థియేటర్ల సంఖ్య పెరుగుతోంది' అని చెప్పారు. నిర్మాతలు రాజశేఖర్, సాయికృష్ణ మాట్లాడుతూ 'కొత్త కాన్సెప్ట్‌తో తీయడం వల్ల సినిమా ప్రేక్షకులకు చేరువైంది. తొలి చిత్రమే అయినా దర్శకుడు మంచి అవుట్‌పుట్ ఇచ్చారు' అని ప్రశంసించారు. 'ముఖ్య గమనిక'ను ఆదరిస్తున్న ప్రేక్షకులకు హీరోయిన్ ఆర్యన్ కృష్ణన్ ధన్యవాదాలు తెలిపారు.

తెనాలి వార్తలు



వార్డులో ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న, తదితరులు

ప్రతిరోజు తాగునీటి శాంపిల్స్‌ను సేకరించండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 26: పట్టణంలో రక్షిత తాగునీటి పథకం ద్వారా అందిస్తున్న తాగునీటి శాంపిల్స్‌ను సేకరించి పరీక్షించాలని సంబంధిత అధికారులను పట్టణ మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న ఆదేశించారు. స్థానిక అమరావతి ప్లాట్స్ 30వ వార్డులో రోజువారీ పర్యటనలో భాగంగా అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాలను మురుగు కాల్వలో వేయరాదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను కోరారు. అధికారులను తాగునీటి శ్యాంపిల్స్‌ను ప్రతిరోజు సేకరించి పరీక్షించాలని అన్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జయరాం, మున్సిపల్ హెల్త్ అధికారులు, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోండి

పట్టణంలోని వ్యాపారులు తమ వ్యాపార సంస్థల ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోవాలని పట్టణ మున్సిపల్ కమాషనర్ బి.శేషన్న తెలిపారు. పట్టణంలో అవుట్‌డోర్ పర్యవేక్షణలో భాగంగా సోమవారం 30, 31 వార్డులను సందర్శించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. అందులో భాగంగా ఆ ప్రాంతంలో వ్యాపారాలను నిర్వహిస్తున్న వారు షాపు యజమానులు డీఅండ్‌వో ట్రేడ్‌లైసెన్స్ రెన్యూవల్ రుసుములను చెల్లించాలన్నారు. డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్‌లు లేని వ్యాపారులు, షాపు యజమానులపై మున్సిపల్ యాక్ట్ ప్రకారం తగుచర్యలు తీసుకొంటామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్-2, డీఈలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, దంపతులు

నియోజకవర్గంలో వైసీపీ జెండా ఎగురవేద్దాం

● ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 26: రానున్న ఎన్నికల్లో తెనాలి నియోజవర్గంలో తిరిగి వైసీపీ జెండాను ఎగురవేద్దామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. సోమవారం పట్టణంలోని గంగానమ్మపేట శ్రీ గంగానమ్మ తల్లి అమ్మవారిని ఎమ్మెల్యే శివకుమార్ దంపతులు, పార్టీ శ్రేణులు దర్శించుకుని రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం సాధించాలని కోరుతూ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు పార్టీ శ్రేణులందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరుతూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పలువురు కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పేదల కడుపు నింపుతున్న అన్న క్యాంటీన్లు

● డాక్టర్ బ్రహ్మాజీరావు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 26: పట్టణంలో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లు పేదల కడుపు నింపుతున్నాయని డాక్టర్ యడ్ల బ్రహ్మాజీరావు అన్నారు. స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో, శివాజీ చౌక్‌లోని అన్న క్యాంటీన్‌లో సోమవారం యడ్ల రాజారావు వర్థంతి సందర్భంగా భార్య యడ్ల విజయలక్ష్మి, కుమారుడు డాక్టర్ బ్రహ్మాజీరావు, మనుమరాలు వైష్ణవిల సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కొత్తపల్లి రమేష్, వెనిగళ్ళ శివప్రసాద్, సోమవరపు సాంబశివరావు, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, గోగినేని రమేష్, మాదల కోటేశ్వరావు, వెల్లంకి సాంబయ్య, ముళ్ళపూడి వెంకట్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు తెనాలిలో తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమావేశం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 26: తెలుగుదేశం పార్టీ నియోజవర్గ ఆత్మీయ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావులు తెలిపారు. తెనాలిలోని ఎన్వీఆర్ కల్యాణ మండపంలో సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొంటారని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరూ పాల్గొనాలని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి

డొంకరోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తా

● ఎంపీ ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి

కొల్లిపర, ఫిబ్రవరి 26: తెనాలి నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ఉన్న డొంక రోడ్లు అన్నింటిని అభివృద్ధి చేయటానికి నిధులు మంజూరు చేయనున్నట్లు ఎంపీ ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపరలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని, హెల్త్‌వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని ఎంపీ ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్, జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, ఎంపీపీ పద్మావతి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు బాధ్యత తీసుకుని రెండునెలల్లో పూర్తిచేయాలన్నారు. కొల్లిపర మండలం అభివృద్ధికి తనవంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజల అవసరాలను తీర్చేందుకు సచివాలయాలను, వెల్‌నెస్ సెంటర్... ఆర్బీకేలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి సచివాలయం వ్యవస్థను తీసుకువచ్చి పేదలకు అండగా నిలిచినట్లు తెలిపారు. అనంతరం ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్ రూ.20లక్షలతో అభివృద్ధి చేసిన కొల్లిపర శ్మశాన వాటికను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ పిల్లి రాధిక, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, ఎంపీడీవో విష్ణుప్రసాద్, మాజీ ఎమ్మెల్యే శివరామకృష్ణారెడ్డి, వైసీపీ జిల్లా ప్రధానకార్యదర్శి జొన్నల శివారెడ్డి, మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కేసన శ్రీలత, చిలుమూరు ఝూన్సీ, నాయకులు కల్లం వీరారెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చే వరకు

రైతుల పోరాటం కొనసాగుతుంది



పెదకాకాని సమీపంలో జాతీయ రహదారిపై నిరసన తెలియజేస్తున్న రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

పెదకాకాని, ఫిబ్రవరి 26: ఢిల్లీ రైతు పోరాటం డిమాండ్లు నెరవేర్చే వరకు ఉద్యమం కొనసాగుతుందని రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు పిలుపుమేరకు సోమవారం రైతు, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెదకాకాని జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమం జరిగింది. నిరసన కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మర్రపు సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ రోజు నుంచి మూడు రోజులు పాటు 26వ తేదీ నుంచి 29 తేదీ వరకు ప్రపంచ వాణిజ్య సంస్థతో కేంద్ర ప్రభుత్వం ఒప్పందాలను కుదుర్చుకోవడాన్ని వ్యతిరేకిస్తూ జాతీయ రహదారిపై దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఆహార భద్రతకు, రైతు పంటల కొనుగోలు సంస్థలు దెబ్బతినే పరిస్థితి ఉంటుందన్నారు. యావత్తు

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ

దేశ ప్రజలకు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతాయన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ ఢిల్లీ సరిహద్దు రైతు ఉద్యమానికి అందరూ మద్దతు తెలపాలన్నారు. వారం నుంచి ఢిల్లీ చుట్టుపక్కల జరుగుతున్న రైతుల పోరాటంలో యువరైతు చనిపోవడం అనేకమంది గాయాలపాలయ్యారన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై విచక్షణరహితంగా దాడులు చేయడం ధ్వంసంచేయటం దుర్మార్గం అన్నారు. మద్దతు ధరల చట్టం చేస్తానని, రైతుకు రెట్టింపు ఆదాయం చేస్తానని హామీ ఇచ్చిన నరేంద్ర మోడీ దీనికి భిన్నంగా పార్లమెంట్లో దొడ్డిదారిన 175 చట్టాలు చేసి వ్యవసాయ రంగాన్ని, పరిశ్రమలను దెబ్బతీసేలా దారుణంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్మికులను దెబ్బతీసేలా చట్టాలను తీసుకువచ్చారన్నారు. తొలుత పెదకాకాని గ్రామ కూడలి నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. తర్వాత జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమం సభ జరిగింది.

కార్యక్రమంలో రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా నాయకుడు కంచుమాటి అజయ్, సీఐటీయూ జిల్లా నాయకులు నళినీకాంత్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి హనుమంతరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పుప్పాల సత్యనారాయణ సత్యానందం, రైతు కూలీ సంఘం నాయకుడు దానబోయిన భాస్కరరావు ఉల్లిగడ్డ నాగేశ్వరావు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కిసాన్ ఫెడరేషన్ నాయకులు కాలువ శ్రీధర్ రావు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ షష్టి ఏఐఎఫ్‌టీయు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైశ్య విద్యానిధి కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యదర్శి వెంకట్రావును సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 26: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి వైశ్య విద్యానిధి కమిటీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. బస్టాండ్ సమీపంలోని వైశ్య విద్యానిధి ద్వారా పేద విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. విద్యానిధి 2024-2027 నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా సుగ్గుల వెంకటప్పయ్య, ఉపాధ్యక్షుడిగా బచ్చు సాంబశివరావు, కార్యదర్శిగా పెండేల వెంకట్రావు, సహాయ కార్యదర్శిగా తాతా శ్రీనివాసరావు, కోశాధికారిగా పెండేల సుబ్బారావులను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యుడిగా చుండూరు నాగమల్లి ఖార్జునరావు, సత్యనారాయణమూర్తి, వెంకటరత్నం, మల్లికార్జునరావు, సుధీర్, శ్రీమన్నారాయణ, రాధాకృష్ణమూర్తి, రామ్మోహనరావు, శ్రీనివాసరావు, రమేష్, సూర్యనారాయణ, గోనుగుంట్ల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. కార్యదర్శి వెంకట్రావును కమిటీ సభ్యులు సత్కరించారు.

ఇంట్లోకి చొరబడి దాడిచేసిన ఘటనపై కేసు నమోదు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 26: ఇంట్లోకి చొరబడి సామానులు ధ్వంసం చేసి మహిళపై దాడిచేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని నందివెలుగు గ్రామానికి చెందిన కొలాటి మల్లేశ్వరి అనే మహిళ నివసిస్తున్న ఇంట్లోకి అదే గ్రామానికి చెందిన బదిరి జయశేఖర్ అనే వ్యక్తి అనుమతిలేకుండా ప్రవేశించి ఇంట్లోని వస్తువులను ధ్వసం చేయడంతో పాటు ఆ మహిళపై దాడిచేశాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ పేర్కొన్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 26: మూడు నెలల నుంచి తన భర్త కనిపించడంలేదని భార్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని కొలకలూరుకు చెందిన మోదుకూరి మాధవికి దేవేందర్‌గౌడ్‌తో మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక బాబు, భార్య మాధవి గర్భిణి. కాగా గత మూడు నెలల నుంచి భర్త కనిపించడంలేదని అత్తవారింటికి కబురుచేసినా సరైన సమాధానం రావడంలేదని రూరల్ పోలీసులకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమెదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఇతడి ఆచూకీ తెలిసిన వారు రూరల్ ఎస్ఐకు 9440 796170కి సమాచారం ఇవ్వాలని కోరారు.



లక్ష తుళసీదళార్చన పూజల్లో స్వామివార్లు, ఆలయ అర్చక స్వాములు తదితరులు

వైభవంగా లక్షతులసీ దళార్చన

చేబ్రోలు, ఫిబ్రవరి 26: శ్రీరుక్మిణీసత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని శేకూరులో పురాతన దేవాలయంగా ప్రసిద్ధిచెందిన రుక్మిణీ సత్యభామసమేత వేణుగోపాలస్వామివారి దేవస్థానంలో ఈ నెల 21 నుంచి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజు యజ్ఞశ్రీ బ్రహ్మశ్రీమాన్ అగ్నిహోత్రం వెంకటశేషాచార్యులు, అర్చకులు దివి వేణుగోపాలాచార్యులు, ఎస్ఎల్ ఫణిరాజకుమార్, శ్రీనివాసాచార్యులు, చరణ్, శేషసాయిలు స్వామివార్ల మూలమూర్తులకు విశేష అభిషేకాలు, శతసహస్ర (లక్ష) తులసీ దళార్చన, మూర్తిహోమం, పూర్ణాహుతి పూజలు జరిపి భక్తులకు స్వామివారి దర్శనం అనంతరం తీర్థప్రసాద వినియోగం చేశారు. సాయంత్ర స్వామివారికి ద్వాదశి ప్రదక్షణాలు, ఏకాంత సేవతో పూజాది కార్యక్రమాలు ముగిశాయి. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జిల్లాలో నేటి నుంచి టెట్

● డీఈవో కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 26: జిల్లాలో నేటి మార్చి 3వరకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్) నిర్వహించన్నట్లు డీఈవో పీశైలజ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం 9 కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 17,258 మంది పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశామ న్నారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ సెంటర్ (9618454467), (9573382616) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు తమ సందేహాలను ఈ సెంటర్ ద్వారా నివృత్తి చేసుకోవాలని డీఈవో పీశైలజ సూచించారు.

28న జాబ్ మేళా

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 26: ఈ నెల 28న నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పీ.ప్రణయ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్‌మేళాకు అరబిందో ఫార్మా, ఇన్నోవేసర్స్ సర్వీసెస్ తదితర 16 కంపెనీలు హాజరుకానున్నట్లు తెలిపారు. 18 నుంచి 40 సంవత్సరాలలోపు వయసు ఉండి 10, ఇంటర్, ఐటీఐ డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, పీజీ, డిప్లమో తదితర అర్హతలు ఉన్నవారు హాజరుకావచ్చునని తెలిపారు. ఉదయం 9.30నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు.

నేడు రామాచార్యులు కాంస్య విగ్రహావిష్కరణ

● తెనాలి బండ్‌పై ఆవిష్కరించనున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 26: తెనాలి ప్రాంతంలో బీజేపీ తొలితరం నాయకులు, అర్చకుల సంక్షేమం కోసం పాటుపడిన తమిరిశ రామాచార్యులు కాంస్య విగ్రహం నేడు ఆవిష్కరించనున్నారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తలపెట్టిన తెనాలి బండ్‌పై విగ్రహావిష్కరణకు కృషి చేశారు. వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాల వద్ద విజయవాడ రోడ్డు వెంబడి తెనాలి ప్రాంత వైభవానికి కృషిచేసిన వారి విగ్రహాల ఏర్పాటు కోసం పలు వేదికలు సిద్ధం చేశారు. అందులో తొలి విగ్రహం రామాచార్యులది కావడం విశేషం. మంగళవారం ఆయన విగ్రహాన్ని త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి ఆవిష్కరిస్తారు. టుబాకో బోర్డు మాజీ ఛైర్మన్ యడ్ల పాటి రఘునాథబాబు, బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ పలువురు నేతలు పాల్గొంటారు. రామాచార్య స్మారక సమితి ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేశారు.



స్వామివారికి పుష్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పంచముఖ ఆంజనేయస్వామికి పుష్పోత్సవం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 26: షరాఫ్ బజారులోని శ్రీసువర్చలా సమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామికి సోమవారం పుష్పోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంతో వారంరోజులుగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. వైఖానస ఆగమ పండితులు రఘురామ్, నాగ మారుతి, అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, వైదికక్రతువు నిర్వహించారు. ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిల్య, ఈవో శ్రీనివాసరెడ్డి దాతలు బాలకృష్ణ, వెంకట్, వెంకటేశ్వరరావు, రామారావు దంపతులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనురాధ, కిరణ్‌కుమార్ తదితరులు సంకీర్తన బృందం సభ్యులు సేవలందించారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలి క్రైం, ఫిబ్రవరి 26: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు తెనాలి రైల్వే పోలీసులు సోమవారం తెలిపారు. తెనాలి-రేపల్లె రైలు మార్గంలోని భట్టిప్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని 45-50 సంవత్సరాల వ్యక్తి తెనాలి-రేపల్లె ప్యాసింజర్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే కీమెన్ ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించగా మృతుని వద్ద ఎలాంటి వ్యక్తిగత సమాచారం లేకపోవడంతో మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

11 మంది జూదరుల అరెస్టు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 26: పొన్నూరు పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో కోతముక్క జూదం ఆడుతున్న 11మందిని అర్బన్ పోలీసులు సోమవారం అరెస్టు చేసారు. విశ్వసనీయ సమాచారం మేరకు పి.భాస్కర్ జూద శిబిరంపై దాడి నిర్వహించి 11 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.8260 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబుకు చెక్కును అందజేస్తున్న పులివర్తి శేషగిరి రావు

శ్మశాన వాటికకు రూ.18లక్షల విరాళం

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 26: నగరంలోని బొంగరాలబీడులోని మహప్రస్థాన సేవాసమితి ఆధ్వర్యంలో నడుస్తున్న పితృవనం శ్మశాన వాటికకు ప్రముఖ బిల్డర్, వెంకటేష్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత పులివర్తి శేషగిరిరావు రూ.18 లక్షల విరాళాన్ని ప్రకటించారు. సోమవారం మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత నక్కా ఆనందబాబు చేతులమీదుగా నగదు చెక్కును పులివర్తి శేషగిరిరావు కుటుంబ సభ్యులు నిర్వాహకులకు అందజేశారు. పితృవనం శ్మశాన వాటికలో గ్యాస్ ఛాంబర్ ఏర్పాటుకు ఈ విరాళాన్ని వినియోగిస్తామని మహా ప్రస్థానసేవా సమితి అధ్యక్షుడు వెలగపూడి లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ హోమియో వైద్యుడు డాక్టర్ కోటపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. శేషగిరిరావు తన సంపాదనను సేవా కార్యక్రమాలకు వినియోగించడంపై అభినందనీయమన్నారు. ఆనంద బాబు మాట్లాడుతూ బొంగ రాలబీడు శ్మశానవాటిక ఇప్పుడు అద్భుతంగా మారిందని, శేషగిరిరావు స్ఫూర్తితో దాతలు ముందుకు రావాలని కోరారు. మహప్రస్థానం సేవా సమితి అధ్యక్షుడు లక్ష్మణరావు మాట్లాడుతూ బొంగా రాల బీడు శ్మశాన వాటికలో త్వరలో మార్చురీని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం న్యాయవాది పులివర్తి శ్రీనివాస్ అధ్యక్షతన సేవాసమితి ఆధ్వర్యంలో శేషగిరిరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సమితి కార్యవర్గం ప్రతినిధులు కల్లూరి వెంకటరమణ, ధనియాల గాంధీచౌదరి, పులివర్తి కార్తిక్, శేషగిరిరావు కుమారులు డాక్టర్ వెంకటేష్, కమలేష్, కార్తీక్, భాస్కర్ పాల్గొన్నారు.

తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 26: సాధారణ ఎన్నికల కోసం డేటా ఎంట్రీ, ఆఫీస్ సబార్డినేటర్ పోస్టుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో గుజ్జనగుండ్లలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు అర్హత డిగ్రీ, కంప్యూటర్‌పై ఒక సంవత్సరం అనుభవం ఉండాలి. ఆఫీస్ సబార్డినేట్ పోస్టుకు 8వ తరగతి పాసై ఉండాలి. ఇతర వివరాల కోసం 9652065235లో సంప్రదించాలని సూచించారు.



స్పందన కార్యక్రమంలో జేసీ రాజకుమారికి వినతి పత్రం అందచేస్తున్న బీజేపీ నాయకులు

సెంట్రల్ డివైడర్ నిర్మాణం వద్దు

● రథోత్సవానికి ఇబ్బంది అంటూ స్పందనలో బీజేపీ నాయకుల ఫిర్యాదు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 26: పొన్నూరు పట్టణంలో రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నిర్మిస్తున్న సెంట్రల్ డివైడర్ నిర్మాణం ప్రతిపాదనను విరమించుకోవాలని, చారిత్రాత్మక రథోత్సవానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కోరారు. సోమవారం బీజేపీ నాయకులు జిల్లా కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమంలో దీనిపై గుంటూరులో జేసీ రాజకుమారికి అర్జీ అందచేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ పొన్నూరు పట్టణంలోని సాక్షి భావనారాయణస్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాలకు జిల్లావ్యాప్తంగా విశేష ప్రాధాన్యం ఉందన్నారు. బ్రహోత్సవాల ముగింపు సందర్భంగా జరిగే స్వామివారి దివ్య రథోత్సవంలో వేలాదిగా ప్రజలు పాల్గొంటారన్నారు. అయితే ఈ రథోత్సవానికి ఆటంకం కలిగించేలా ఆలయం వద్ద నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు రోడ్డు విస్తరణ పేరుతో సెంట్రల్ డివైడర్ నిర్మిస్తున్నారన్నారు. ఈ డివైడర్ నిర్మా ణం వల్ల రథం ముందుకు కదలేని పరిస్థితులు ఉంటాయన్నారు. రోడ్డుకు మధ్యగా నిర్మిస్తున్న డివైడర్ వల్ల తొక్కిసలాట జరిగితే ప్రజల ప్రాణాలకు హాని ఉంటుందన్నారు. తక్షణమే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని నిర్మాణాన్ని నిలిపివేయాలని బీజేపీ నాయకులు కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కలపాల శ్రీనివాసరావు, చేకూరి తిరుపతిరావు, కుమార్‌గౌడ్, డి.శివయ్య, ఆర్.గోపి, వి.సుధాకర్ తదితర జిల్లా నాయకులతో పాటు మండల అధ్యక్షుడు వి.ఉదయ్ చంద్రరావు, జి.పవన్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణుడి ఆలయానికి శంకుస్థాపన



కృష్ణుడి దేవస్థానం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నరేంద్ర కుమార్

చేబ్రోలు, ఫిబ్రవరి 26: మండల కేంద్రమైన చేబ్రోలు కొత్తరెడ్డిపాలెంలో నూతనంగా నిర్మించనున్న శ్రీకృష్ణుడి దేవాలయానికి సోమవారం భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కో రారు. కార్యక్రమంలో చేబ్రోలు టీడీపీ అధ్యక్షుడు షైలా వెంకటరామరాజు, పఠాన్‌ఇర్ఫాన్, తోట మణికంఠ, మోదుల సుబ్బారెడ్డి, గాదె సుబ్బారెడ్డి, దుర్గంపూడి రమణారెడ్డి, రాజశేఖర్, వణుకూరి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వడ్లమూడి క్వారీ శివాలయం సమీపంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో నరేంద్రకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 26: ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ పొన్నూరు శాఖ మేనేజర్ సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని ఎస్‌పీపీ రోడ్డులో రిజర్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ సహకారంతో అవార్డు స్వచ్ఛంద సంస్థ నిర్వహణను ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. పొన్నూరు, కాకుమాను, చేబ్రోలు మండలాల పరిధిలో ఈ కేంద్రం ద్వారా బ్యాంకింగ్ లావాదేవీలు, డిజిటల్ బ్యాంకింగ్, సైబర్ నేరాలు, ఇతర పథకాలు, బ్యాకింగ్ అంబుడ్స్‌మెన్ సేవల గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఐ ఏపీఎం గోపి, బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఏ మోహనకృష్ణ, యూటీఐ అధికారి బి.సత్యనారాయణరెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, డి.మణిభూషన్, కెనరా బ్యాంక్ అధికారి బి.ఆంజనేయులు, కేంద్రం కౌన్సిలర్లు వై.రమేష్, టి.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు వడ్డిముక్కలకు మైనార్టీ నిజనిర్ధారణ కమిటీ

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 26: ఉద్రిక్తతలకు కారణమైన వడ్డిముక్కలలో మంగళవారం ఉదయం 9గంటలకు మైనార్టీ నిజ నిర్ధారణ కమిటీ పర్యటించనున్నట్లు టీడీపీ నాయకులు సోమవారం తెలిపారు. టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మహ్మద్ మోసిన్, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌గని ఆధ్వర్యంలో పర్యటించే కమిటీ ముస్లింలపై జరుగుతున్న దాడులపై నిజనిర్ధారణ చేయనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

గుర్తుతెలియని యువకుడి హత్య

గుంటూరు, ఫిబ్రవరి 26: స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చేపల మార్కెట్ సమీపంలోని ఉల్లి పాయల కొట్ల వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి (35) దారుణ హత్యకు గురయ్యాడు. సోమవారం ఉదయం గమనించిన స్థానికులు లాలాపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న లాలాపేట సీఐ దేవప్రభాకర్, ఎస్ఐ సుబ్బారావు ఘటనస్థలాన్ని పరిశీ లించారు. తొలుత ప్రమాదవశాత్తు మరణించి ఉంటాడని భావించినప్పటికీ పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిం చగా యువకుడిని రాయితో కొట్టి చంపినట్లు నిర్ధారించారు. సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించగా ఏటీ అగ్రహారంకు చెందిన సిద్దార్థ అనే యువకుడు ఈ హత్యకు పాల్పడినట్లు గుర్తించారు. కాగా నిందితుడు సిద్దార్థ పరారీలో ఉన్నాడు. అయితే హత్యకు గురైనది ఎవరనేది తెలియ రాలేదు. పోలీసులు అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నారు. వీరిద్దరు ఆదివారం రాత్రి శానిటైజర్ తాగినట్లు గుర్తించారు. ఈ క్రమంలోనే వారి మధ్య ఘర్షణ చోటుచేసుకోగా సిద్దార్థ రాయితో ఆ యువకుడిని కొట్టి చంపినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడు పట్టుబడితే గాని హతుడు ఎవరనేది తెలియరాదని పోలీసులు తెలిపారు.

ఈవీఎం గోడౌన్‌కు పటిష్ట భద్రత: కలెక్టర్



ఈవీఎం గోడౌన్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు సీఈవో

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నెలాఖరు తనిఖీలలో భాగంగా సోమవారం గుంటూరు ఆర్డీవో కార్యాలయం ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఎంఎన్ హరేంద్ర ప్రసాద్‌తో కలిసి తనిఖీ చేశారు. గోడౌన్ షట్టర్లకు వేసిన తాళాల సీళ్ళను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని చర్యలు పకడ్బందీగా తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీవో శ్రేఖర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈవీఎంలనోడల్ అధికారి వేణుగోపాల్, జిల్లా సహాయక అగ్నిమాపక శాఖాధికారి కృష్ణారెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.